నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
సోమవారం | డిసెంబర్ 09, 2024 | www.navatelangana.com

కో'ఢీ'



నవతెలంగాణ-రెంజల్

రెండు కోళ్ల ఢీకొట్టుకుంటున్నాయంటే ఎక్కడో కోడి పందాలు జరుగుతున్నట్టు అనుకుంటే మీరు పప్పులో కాలేసినట్టే. మండలంలోని వీరన్నగుట్ట గ్రామంలో తెల్లవారుజామున రెండు కోడిపుంజులు ఒకదానిపై మరొకటి దాడి చేసుకుండగా నవతెలంగాణ క్లిక్ మనిపించింది. సంక్రాంతి పండుగ సందర్భంగా ఒకరిపై ఒకరు తాము పెంచుకున్న కోళ్లను కోడి పందేల ఆటలో పందెం కాస్తు ఉంటారు. కానీ ఇవి ఒకే గూటిలో నుంచి బయటకు వచ్చి ఘర్షణ పడుతుండటం గమనార్హం.

కామారెడ్డిలో బ్రహ్మానందం సందడి

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రముఖ హాస్యనటులు బ్రహ్మానందం ఆదివారం సందడి చేశారు. ఓ కార్యక్రమానికి హాజరైన బ్రహ్మానందంను చూసేందుకు ఆయన అభిమానులు పెద్దసంఖ్యలో తరలివచ్చి సెల్ఫీలు తీసుకునేందుకు ఉత్సాహం చూపారు. కామారెడ్డికి రెండోసారి వచ్చానని, ఇక్కడికి రావడం ఆనందాన్ని ఇచ్చిందని తెలిపారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్ ఇంటికి వెళ్లి కుటుంబీకులతో మాట్లాడారు.



బ్రహ్మానందంకు పుష్పగుచ్చం అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కుటుంబీకులు



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్వీ రమ

బలమైన కార్మిక ఉద్యమాన్ని నిర్మిద్దాం

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్వీ రమ

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లాలో పారిశ్రామిక కార్మికులు ఒక పక్క, స్కీం వర్కర్స్, అసంఘటిత కార్మికులు మరో పక్క లక్షల సంఖ్యలో ఉన్నారని, వీరందరి సమస్యలను సమగ్రంగా అధ్యయనం చేసి, కార్మికుల సంసిద్ధతని బట్టి పోరాటాలను చేసి బలమైన కార్మిక ఉద్యమాన్ని నిర్మిద్దమని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్ వి రమ అన్నారు. ఆదివారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో సీఐటీయూ జిల్లా వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్ షాప్‌నకు ఆమె హాజరై మాట్లాడారు. ఎన్నో ఆశలతో, ఆకాంక్షలతో ఏరి కోరి తెచ్చుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం పని తీరు సంవత్సరం కాలం లోనే తేటతెల్లం అయ్యిందని, ఏ ఒక్క సమస్య పరిష్కరించలేని దీంతో కొన్ని రంగాల కార్మికుల్లో అసంతృప్తి తీవ్రత పెరుగుతుందని తెలిపారు. అనివార్యమైతే సమ్మె లోకి కూడా వెళ్లడానికి సిద్ధమవుతు న్నారని అన్నారు. మరి కొన్ని రంగాల్లో ఇప్పుడిప్పుడే అసంతృప్తి మొదలైందని అన్నారు. స్కీం వర్కర్లకు, అసంఘటిత రంగ కార్మికులకు ఉద్యోగ భద్రత లేదని, అరకొర వేతనాలతో పని చేస్తున్నారని, పని భారం రోజు రోజుకి పెరుగుతున్నదని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పరిశ్రమల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు నెలకు 26 రోజుల పని ఇవ్వడం లేదని, నామ మాత్రపు వేతనాలు ఇస్తున్నారని అన్నారు. కనీసమైన గుర్తింపు కార్డ్ లు, ప్రమాద బీమా ఇతర ఏ సౌకర్యాలు అమలు జరగడం లేదని అన్నారు. కేంద్ర,రాష్ట్ర పాలక వర్గాలు మాత్రం ఇబ్బడి ముబ్బడిగా ధరలు పెంచుతున్నారని, ధరల భారంలో కార్మికులు బతకలేని పరిస్థితి వచ్చిందన్నారు. నెలల తరబడి వేతనాలను పెండింగ్ ఉంచుతున్నారని, దీనికి ఉదాహరణే గ్రామపంచాయతీ కార్మికులకు 6 నెలల నుండి వేతనాలు పెండింగ్ లో ఉన్నాయని, గ్రామ పంచాయతీ కార్మికులకు మూడు నుండి పది నెలల వరకు వేతనాలు పెండింగ్ లో ఉన్నాయని అన్నారు.

గ్రామ పంచాయతీ రంగంలో మల్టి పర్పస్ విధానం వచ్చిన తర్వాత కార్మికులు పిట్టల్లా రాలిపోతున్నారని, మల్టీ పర్పస్ వర్కర్స్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా కార్మికులపై లైంగిక వేదింపులు జరుగుతున్నాయని అన్నారు. కార్మికులకు ఎన్నికలకు ముందిచ్చిన ఏ ఒక్క హామీ కూడా అమలు చేయలేదని, ఇప్పటికైనా హామీల అమలుకు ప్రభుత్వం పూనుకోవాలని లేని యెడల మిలిటెంట్ పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. నిరంతరం కార్మికులను అంటిపెట్టుకుని పని చేయాలని, సమస్యలకు ప్రభుత్వ విధానాలను ముడి పెట్టి కార్మికులకు అర్థమయ్యేలా చెప్పాలని అన్నారు. కార్యక్రమంలో సిఐటియూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శంకర్‌గౌడ్, నూర్జహాన్, కోశాధికారి స్వర్ణ, ఉపాధ్యక్షులు నన్నేసాబ్, మోహన్, కటారి రాములు, గణేష్ సుకన్య, రేణుక, వాణి, గంగాధర్, మధ్యాహ్నం భోజనం కార్మికులు పాల్గొన్నారు.



నవీపేట్‌లో కాంగ్రెస్ చీఫ్ ఎవరు?



- కాంగ్రెస్ పాలనకు ఏడాది పూర్తి
- కోమాలోనే మండల అధ్యక్షులు
- వర్గాలుగా విడిపోతున్న పార్టీ శ్రేణులు
- అన్నిట్లో ఆ ఇద్దరిదే పెత్తనం
- కార్యకర్తల్లో పెరుగుతున్న అసంతృప్తి
- పట్టించుకోని అధిష్టానం
- స్థానిక పోరుపై ప్రభావం

నవతెలంగాణ-నవీపేట్

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పాలనకు ఏడాది పూర్తవుతున్నా. నవీపేట్ మండలంలో కాంగ్రెస్ శ్రేణులను నడిపించే సరైన నాయకుడు లేక శ్రేణులలో అసంతృప్తి ఏర్పడి వర్గాలుగా విడిపోతున్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుధాకర్ రావు పార్టీ శ్రేణులను కలుపుకొని పోయి పార్టీ విజయంలో కీలక పాత్ర పోషించారు. కానీ రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలై ఏడాదిగా కోమాలో ఉంటూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎమ్మెల్యేగా సుదర్శన్ రెడ్డి గ్రామాల్లో తిరుగుతూ ప్రజలు, రైతులతో మమేకమై సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధి పనులను ప్రారంభిస్తూ ప్రజా ప్రభుత్వం చేస్తున్న ప్రజా సంక్షేమాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్లేందుకు కృషి చేస్తున్నారు. అంతవరకు బాగానే ఉన్నా మండలంలోని ద్వితియ శ్రేణి కార్యకర్తలను కలుపుకొని పోయి పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలకు సమాచారం అందించడంతో పాటు కార్యకర్తల గోసను వినే నాయకుడు లేక ఏడాదిలోనే కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమ అసంతృప్తిని బాహాటంగానే వ్యక్తపరుస్తున్నారు.

పట్టించుకోని అధిష్టానం!

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సొంత మండలంలో ఏడాది పాలనలో ఎమ్మెల్యేగా అభివృద్ధి పనులతో ప్రజల్లోకి మరింత చేరువ అవుతున్నప్పటికీ ద్వితీయ శ్రేణి కార్యకర్తలను పట్టించుకోవడం లేదని ఒకరిద్దరూ నాయకులకు మాత్రమే ప్రాధాన్యతనిస్తున్నారని కార్యకర్తలు బహిరంగంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ నాయకుడికి మంత్రి పదవి రాకపోవడంతో మంత్రి పదవి వచ్చిన తర్వాతనే తమ గోడును ఆయన దృష్టికి తీసుకు వెళ్లేందుకు వేచి చూస్తున్నట్లు వినికిడి.

స్థానిక పోరుపై ప్రభావం

త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో మండలంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వర్గాలుగా విడిపోతే తీవ్ర ప్రభావం పడుతుందని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో బిఆర్ఎస్, బిజెపి పార్టీలు ఇంకా బలంగానే ఉండటంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో తీవ్రమైన పోటీ ఉండే అవకాశం ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో అధికార కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా కృషి చేయకపోతే ఫలితాలు తారు మారయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డితో పాటు జిల్లా అధిష్టానం స్పందించి సమర్థమైన నాయకుడిని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నుకొని మండలంలో పార్టీని బలోపేతం చేయాలని కార్యకర్తలు భావిస్తున్నారు.



అన్నిట్లో ఆ ఇద్దరిదే పెత్తనం

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో మండల స్థాయి పదవులు అనుభవించిన ఆ ఇద్దరే.. ప్రస్తుతం సైతం పెత్తనం చెలాయిస్తున్నారు. మండలంలో ఏడాదిగా జరుగుతున్న ప్రజా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలలో సీనియర్, ద్వితీయ శ్రేణి కార్యకర్తలను పట్టించుకోకపోవడంతో శ్రేణులు గ్రూపులుగా విడిపోతున్నారు. ఇసుక, మొరం దందాలతో పాటు కాంట్రాక్టులు, పోలీస్ కేసులు, అధికారుల డిప్యూటేషన్లు చివరకు విలేకరుల మార్పులలో సైతం జోక్యం చేస్తుండడంతో మాజీ మంత్రి ప్రతిష్ట పలుచన అవుతుందనే భావన సొంత పార్టీలోనే వ్యక్తమవుతుంది. పలు సందర్భాల్లో మాజీ మంత్రిని మిస్‌గైడ్ చేస్తున్నారని కార్యకర్తలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.



ఎమ్మెల్యే పర్యటనకు ముందు కాంట్రాక్ట్‌లపై మాట్లాడుకుంటున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు(ఫైల్)

ప్రజలు ఆరోగ్యంగా ఉండాలి

- అంబులెన్స్ అవసరం ఎవరికీ రాకూడదు
- రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-వర్ని (చందూర్)

నియోజకవర్గ ప్రజలు ఆరోగ్య వంతులుగా ఉండాలని, ఎవరికి అంబులెన్స్ అవసరం రాకూడదని రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులు, శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం చందూర్ మండల కేంద్రంలో పల్లెదవాఖానకు నూతనంగా మంజూరు అయినా అంబులెన్స్‌ను ఎర్ర జెండా ఊపి పారంభించారు. మండల ప్రజలతో మాట్లాడుతూ.. చందూర్ మండలం అదృష్టం మండలమని, కొత్త మండలంతో అన్ని వసతులు, కార్యాలయలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం పరంగా ప్రభుత్వ ఆసుపత్రిలకు అన్ని రకాల రోగాలకు సంబంధించిన మందులను, వైద్యులను ఏర్పాటు చేసిందని తెలిపారు. చందూర్ మండల కేంద్రంలో త్వరలో ప్రాథమిక ఆరోగ్య 30 పడకల ఆసుపత్రి నిర్మాణం జరుగుతుందని, టెండర్ కూడా పూర్తి అయినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కర్లం సాయరెడ్డి, మాజీ జడ్పీటీసీ అంబర్ సింగ్, ప్యారం అశోక్ యాదవ్, మాజీ సర్పంచ్‌లు లక్ష్మపూర్ సత్యనారాయణ, దేవి సింగ్, మాజీ ఏఎంసి చైర్మన్ మూడ్ కవిత అంబర్ సింగ్, మాజీ ఎంపీపీ లావణ్య రాంరెడ్డి, రాజారెడ్డి, సంజీవ్, గుర్ల మల్లయ్య, జైరాం, పిహెచ్‌సి వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

అభివృద్ధి వైపు పరుగులు

- నియోజకవర్గానికి మరిన్ని తీసుకొస్తా
- బిచ్కుంద వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణస్వీకారోత్సవంలో ఎమ్మెల్యే తోట లక్ష్మికాంత్‌రావు

నవతెలంగాణ-బిచ్కుంద

జుక్కల్ నియోజకవర్గం అభివృద్ధి వైపు పరుగులు తీస్తుందని.. నియోజకవర్గానికి మంజూరైన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌లు నిదర్శనం అనిఎమ్మెల్యే తోట లక్ష్మికాంత్‌రావు అన్నారు. అంతేకాకుండా స్పోర్ట్స్ స్కూల్, నర్సింగ్ కాలేజీలను నియోజకవర్గానికి తీసుకొస్తానని తెలిపారు. బిచ్కుంద మండలంలోని వాజీద్ నగర్ గ్రామంలో బిచ్కుంద వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ దొడ్ల కవిత ప్రభాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ కొంగల శంకర్ డైరెక్టర్లు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ హాజరయ్యారు. ప్రమాణస్వీకారం చేసిన నూతన కమిటీకి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు.

అనంతరం మాట్లాడుతూ నిజాంసాగర్ ప్రాజెక్టు, కౌలాస్ నాలా, కౌలాస్ కోటను పర్యాటకంగా అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. గుల్ల గ్రామం నుండి సిరిసిల్ల వరకు హైవే నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాద నలు పంపించామన్నారు. మద్నూర్ నుండి బోధన్ వరకు నేషనల్ హైవే నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయని తెలిపారు. రంగాల్లో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి కృషి చేస్తున్నాని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్లికార్జునప్పా షెట్కార్, గోపాల్ రెడ్డి పటేల్, పిసిసి డెలిగేట్ విట్టల్ రెడ్డి మాజీ డిసిసిబి డైరెక్టర్ వెంకట్రాం రెడ్డి పార్టీ మండల అధ్యక్షులు ధర్పల్లి గంగాధర్, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న బిచ్కుంద మార్కెట్ కమిటీ పాలవకర్గం సభ్యులు

ప్రభుత్వ ఆదాయాన్ని తోడేస్తున్నారు

- ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి
- ఆదాయ వనరులపై దృష్టి సారించని అధికారులు
- అక్రమార్కులకే వత్తాసు..?

నవతెలంగాణ-నిజామాబాద్

అసలే పంచాయతీలు నిధుల సమస్యతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. నిధుల సమీకరణకు రాష్ట్ర ప్రభుత్వం సర్వశక్తులూ ఒడ్డుతుంది. ప్రజలపై భారాలు పడకుండా స్థానిక వనరులతో ఆదాయ మార్గాలపై దృష్టిసారించాలని ప్రభుత్వం అధికారులకు సూచిస్తుంటే.. అందుకు విరుద్ధంగా పలు చోట్ల అధికారుల పనితీరు కనిపిస్తుంది. పలువురు మాత్రం ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ అక్రమ దందాలు చేస్తున్న వారికి బాసటగా నిలుస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి పడేలా వారి జేబులు నింపుకోవడానికి పని చేస్తున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితి బాల్కొండ నియోజకవర్గం పెద్దవాగు పరివాహక ప్రాంతంలో యథేచ్ఛగా కొనసాగుతుందని చెప్పుకోవచ్చు.

వివరాల్లోకి వెళ్తే.. పెద్దవాగులో నుండి ఇసుక తీయాలంటే ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా కారణాలు చూపుతూ ట్రిప్పుల ప్రకారం డిడి రూపంలో ప్రభుత్వానికి డబ్బులు చెల్లించి వే బిల్లు లు తీసుకొచ్చుకొని అధికారుల కనుసైగల్లో ఇసుక తీసుకోవాలి. ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం ప్రకారం తిరిగి జిల్లా, మండల పరిషత్‌ల ద్వారా ఆయా గ్రామాలకు ప్రభుత్వం కేటాయిస్తుంది. గతంలో ఉదాహరణకు చూసినట్లయితే 2008 నుండి 2011 వరకు నిజామాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్ గా కాటిపెల్లి వెంకటరమణ రెడ్డి చేసిన సమయంలో జిల్లా పరిషత్ స్థానిక సంస్థలు ఆర్థికంగా బలపడటానికి అవకాశాలను వెతికి బాల్కొండ నియోజకవర్గంలోని పెద్దవాగు పరివాహక గ్రామాలలో ఇసుక క్వారీలను గుర్తింపచేసి క్వారీలకు వేలం వేశారు. ఇట్టి క్వారీలను వేలం వేయడం ద్వారా జిల్లా పరిషత్‌కు ఆయా మండల పరిషత్‌లకు, ఇసుక క్వారీలు ప్రభుత్వం వేలం వేయబడిన గ్రామాలకు లక్షలాది రూపాయలు అభివృద్ధికి కేటాయించబడినాయి.

కానీ ప్రస్తుతం ఉన్నవారిలో పలువురు ప్రజాప్రతినిధులు ఆయా పార్టీల రాజకీయ నాయకులు సంబంధిత అధికార యంత్రాంగం సైతం అక్రమ సంపాదనలకు అలవాటు పడి అభివృద్ధిపై గానీ ప్రభుత్వ ఖజానాకు సంబంధించిన ఆర్థిక వనరులు చేకూర్చడం పై శ్రద్ధ చూపలేకపోతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గ్రామాలలో ఇండ్లు నిర్మించడంతో వాటి అవసరాలను ఆసరాగా తీసుకొని ధనార్జనే ధ్యేయంగా వ్యాపారులు గ్రామ మండల స్థాయి నాయకులు ఇసుక మాఫియా ముఠాలుగా ఏర్పడి విచ్చలవిడిగా ఇసుకతో పాటు మొరం మట్టిని కూడా వదలకుండా అక్రమ రవాణా నిర్వహిస్తూ లక్షలాది సొమ్మును అక్రమంగా ఆర్జిస్తున్నారు.

పలువురు అధికారులకు ఎంతకొంత ముట్టజెప్పుండటంతో ఈ వ్యవహారంపై నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తూ.. అక్రమార్కులైన పలువురు నాయకులకు తమ వంతు తోడ్పాటు సైతం అందిస్తున్నట్టు వినికిడి. దీనితో ప్రభుత్వ ఆదాయానికి గండి పడటమే కాకుండా ప్రజా రవాణాకు ఉపయోగపడవలసిన రోడ్లు ధ్వంసమై ప్రభుత్వం ఖజానాకు చిల్లులు పడుతున్నాయి.

మొరం ఇసుక మాఫియా ముఠాల పాదాల కింద సామాన్యుడు విలవిలలాడుతున్నాడు. తెలంగాణలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాలకు ఆర్థిక లేమి అడ్డుతున్న ఈవేళ అధికారులు మనీ మత్తు నుండి బయటపడి సర్కారు ఖజానాకు ఆదాయ వనరులను సమకూర్చే దిశగా ప్రయత్నించాలని స్వప్రయోజనాలకు కాకుండా సర్కారు కోసం సామాన్య ప్రజానీకం కోసం ఇకనైనా విధులు నిర్వహించాలని సామాన్య ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇకనైనా ఉన్నత అధికారులు తక్షణమే స్పందించి ప్రభుత్వ ఆదాయ వనరులపై నిర్లక్ష్యం వదిలి ప్రత్యేక దృష్టి పెట్టి అక్రమార్కుల అక్రమ దందాలకు అడ్డుకట్ట వేసి ప్రభుత్వం నష్టపోకుండా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు.




కూలీలతో పెద్దవాగు నుంచి ఇసుక అక్రమంగా తరలింపు

ఎన్నికలకంటే ముందే మందు, విందు

- గ్రామాల్లో దావత్‌లకు తెరతీసిన పలువురు సర్పంచ్ ఆశావహులు

నవతెలంగాణ-తాడ్వాయి


ప్రభుత్వం పంచాయతీ ఎన్నికల తేదీ ప్రకటించనేలేదు. రిజర్వేషన్ తెలవదు. అయినా కొందరు నేతలు ఆయా గ్రామాల్లో కుల సంఘాల సభ్యులకు విందులు ప్రారంభించినట్టు సమాచారం. వచ్చే ఎన్నికల్లో తమకు రిజర్వేషన్ రాకపోయినా మహిళా రిజర్వేషన్ వచ్చిన సందర్భంలో తమ సతులను బరిలో దింపి గెలిపించుకుంటామన్న దీమాతో ఓటర్లకు విందులు ఏర్పాటు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఆయా గ్రామాల్లో పీజీలు చేసినటువంటి నిరుద్యోగ యువత సైతం పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొంది గ్రామాల అభివృద్ధిలో ముందుకు తీసుకుపోయే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. కుల సంఘ నేతలను తమ వైపు తిప్పుకోవాలనే విందు రాజకీయాలు ఏర్పాటు చేస్తున్నట్టు కొందరు నేతలు చర్చించుకుంటున్నారు. రిజర్వేషన్ ప్రకటిస్తే మండలంలోని గ్రామాల్లో విందులు ఎలా ఉంటాయో వేచి చూడాల్సిందే.



సమస్యల పరిష్కారానికి ఏజెంట్లందరూ సంఘటితమై ఉండాలి

నవతెలంగాణ-రామారెడ్డి

సమస్యల పరిష్కారం కోసం ఎల్ఐసి ఏజెంట్లు అంత సంఘటితమై ఉండాలని లియాఫీ నాయకులు సూచించారు. జిల్లా కేంద్రంలోని ఎల్ఐసి కార్యాలయంలో ఆదివారం లియాఫీ నూతన కార్యవర్గ మొదటి సమావేశాన్ని అధ్యక్షులు కదం నారాయణరావు అధ్యక్షతన నిర్వహించారు. పాలసీదారుల, ఏజెంట్ల సమస్యల పరిష్కారం కోసం నాయకులం ఎల్లవేళలా కృషి చేస్తామని, నాయకులకు అండగా ఏజెంట్లు ఉండాలని సూచించారు. అందరూ సంఘటితంగా ఉంటేనే కార్పొరేషన్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని అన్నారు. ప్రైవేటు కంపెనీలకు దీటుగా ప్రభుత్వ రంగ సంస్థ ఎల్ఐసి లో పనిచేసే ఏజంట్లు మారుతున్న పరిణామాలకు అను గుణంగా ఎప్పటికప్పుడు నిత్యం పూర్తి పరిజ్ఞానంతో మార్కెట్లోకి వెళ్లాలని సూచించారు. పలువురు ఏజెం ట్ల సమస్యలపై నాయకుల దృష్టికి తీసు కెళ్లగా, సమస్యల పరిష్కారానికి కార్పొరేషన్ దృష్టికి తీసుకువెళ్లి అయాఫీ ఆధ్వర్యం లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలిండియా నాయకులు కిషోర్ ఛంద్, డివిజన్ నాయకులు మోహన్, జనరల్ సెక్రెటరీ ప్రదీప్ కుమార్ జైన్, కోశాధికారి ఉమాపతి, క్లియ అధ్యక్షులు రాజిరెడ్డి, నాయకులు కొండ భైరయ్య, అంజన్ కుమార్, సత్యనారాయణ, పుట్ట నారాయణ, బాయికాడి సుధాకర్, రాజులు, కిష్టయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
నిజామాబాద్
సోమవారం డిసెంబర్ 09, 2024 www.navatelangana.com

అడ్వకేట్ పట్టా అందుకున్న పాఠశాల కరస్పాండెంట్



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి సెయింట్‌పాల్ హైస్కూల్ కరస్పాండెంట్ బి.యానోచ్‌పాల్ అడ్వకేట్ పట్టా అందుకున్నట్టు పాఠశాల యాజమాన్యం, సన్నిహితులు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బార్ కౌన్సిల్‌లో అడ్వకేట్‌గా జాయిన్ అయ్యానని, తన కృషికి సహకరించిన బంధువులకు, శ్రేయోభిలాషులకు, సన్నిహితులకు కృతజ్ఞతలు చెబుతున్నట్టు తెలిపారు.

సాలూర మండలంలో యాసంగి వరినాట్లు ప్రారంభం



నవతెలంగాణ-బోధన్

యాసంగి సీజన్ వరినాట్లు ఇప్పుడిప్పుడే ప్రారంభమయ్యాయి. ఆదివారం సాలూర మండలం కొప్పర్తి క్యాంప్, సాలంపాడ్ శివారులలో రైతులు బోరుబావుల కింద వరినాట్లు వేయడం ప్రారంభించారు. బీహార్ నుంచి వచ్చిన కూలీలు యాసంగి సీజన్ వరినాట్లు వేయడంలో నిమగ్నమయ్యారు.

పలువురిని సన్మానించిన సీఎస్ఐ చర్చి కమిటీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఘంటసాల ప్రాంతంలో గల సీఎస్ఐ చర్చిలో ఆదివారం క్రిస్మస్ ఉత్సవాల సందర్భంగా పలువురిని చర్చి కమిటీ సభ్యులు సన్మానించారు. మాజీ మంత్రి వేణుగోపాలచారి, నుడా ఛైర్మన్ కేశ వేణు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నరాల రత్నాకర్‌ను వారు సత్కరించారు. అనంతరం పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో రెవ జార్జ్ ప్రెసిబిటర్, ఇన్చార్జి రెవ ప్రకాశ్, రెవ కృపాకర్, కార్యదర్శి సుధీర్, సన్నీ, విలియం, చక్కని, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

నీలాలో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం లక్ష్మీ ప్రియ హాస్పిటల్ సూర్య ఆరోగ్య సంస్థ డిఆర్ ట్రేడర్స్ సహకారంతో నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ సంతోష్, డాక్టర్ చైతన్య, ఆప్తమెట్రిస్ట్ శ్రీకాంత్ పాల్గొని రోగులకు ఉచిత పరీక్ష నిర్వహించి వారికి ఉచితంగా మందులను అందజేశారు. ఈ శిబిరం ద్వారా 170 మంది వ్యాధిగ్రస్తులు లబ్ధి పొందారు. ఈ కార్యక్రమంలో దయాకర్‌రెడ్డి, ఎజాస్ హైమద్, సూర్య ఆరోగ్య సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రాజేంద్ర కుమార్, విక్రమ్, వినోద్, లక్ష్మీ ప్రియ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ సమీర్, షాహీ యూత్ సభ్యులు సద్దాం హైమద్, మెహరాజ్, సోను, తహ, ముసెఫ్, గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు వైద్య శిబిరంలో పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన గ్రామ కమిటీ సభ్యులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కళ్యాపూర్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీని ఆదివారం ఎన్నుకున్నట్టు ఎమ్మార్పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బండారి పోశెట్టి, రెంజల్ మండల ఇన్చార్జ్ కిన్నెర మోహన్ సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షులుగా పిల్లల లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా బి.ఒడ్డెన్న, బి.దేవన్న, కార్యదర్శిగా బి.గంగాధర్, సలహాదారులుగా సుమన్, పోశెట్టి, గంగాధర్, అనిల్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

దమ్మన్నపేట గ్రామంలో మల్లన్న జాతర



పూజలు నిర్వహిస్తున్న మహిళలు

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో మల్లన్న జాతర ఉత్సవాలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఇంటి నుంచి బోనం ఎత్తుకొని మల్లన్న ఆలయానికి డప్పువాయిద్యాలతో చేరుకున్నారు. మల్లన్నకు పూజలు నిర్వహించారు. పూలమాలలు వేసి నైవేద్యాలు అన్నప్రసాదాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా పరిపాలన విజయోత్సవాలు



కరపత్రాలను అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-బాల్కొండ

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సంవత్సర కాలంలో అమలు చేసిన పథకాలు, అభివృద్ధి పనులు, ఎన్నికల హామీలపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికి పత్రాలు అందజేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహాలక్ష్మి పథకం 500కే సిలిండర్, గృహజ్యోతి 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్, సన్నవడ్లకు 500 రూపాయలు బోనస్, రెండు లక్షల రుణమాఫీ, 10 లక్షల వరకు ఆరోగ్యశ్రీ వర్తింపు, 50 వేలకుపైగా ఉద్యోగాలు ఇలా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ప్రతి ఒక్కటి మాట తప్పకుండా అమలు చేస్తున్న సందర్భంగా ప్రజా పరిపాలన విజయోత్సవ పత్రాలు ఇంటింటికి పంచి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పనుల గురించి కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షులు సంజీవ్‌గౌడ్, దివాన్ వెంకటేష్, గోపు ఉషన్న, గోపు మహేష్, పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాహిత్య అస్తిత్వానికి కార్యాచరణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ అస్తిత్వ సాహిత్యం-వర్తమాన సందర్భం అనే అంశాన్ని తెలంగాణ రచయితల సంఘం పదేండ్ల సాహిత్య సభల సందర్భంగా ఎంచుకోవడం అభినందనీయమని, మేధావులంతా మేథోమథనం చేసి తెలంగాణ అస్తిత్వానికి కార్యాచరణ ప్రకటించాల్సిన అవసరం ఉందని తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఘనపురం దేవేందర్ అన్నారు. ఆదివారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగిన తెలంగాణ రచయితల సంఘం 10 ఏళ్ల సాహిత్య సభలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో డాక్టర్ నందిని సిద్ధారెడ్డి, నిఖిలేశ్వర్, డాక్టర్ నాళేశ్వరం శంకరం, వేణుగోపాల్, కందుకూరు శ్రీరాములు, జీ నరసింహ స్వామి, డాక్టర్ వి శంకర్, ముత్తిగారి కవిత తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాలు ప్రజల వద్దకు చేరాలి

- అలా ప్రచారం చేయాలి
- కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల చారి

నవతెలంగాణ-కంఠేశ్వర్

కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరేలా ప్రచారం చేయాలని కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల చారి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నిజామాబాద్ నగరంలోని 9వ డివిజన్ ఇంచార్జ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శోభన్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రజా పాలన విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలచారి హజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలమవుతున్న ఈ సందర్భంగా రాష్ట్రంలో ఎక్కడైనా సరే బీఆర్ఎస్ అబద్ధపు ప్రచారాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజల వద్దకు చేరేలా ప్రచారం చేయాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అబద్ధపు ప్రచారాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం మీద అనవసరంగా బిజెపి, బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 9వ డివిజన్ ఇంచార్జి శోభన్ మాట్లాడుతూ రాబోయే కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు తన డివిజన్ ప్రజలకు అందేలా చూస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్, నరాల రత్నాకర్, కేశ వేణు, రాంభూపాల్, యాదవ సంఘం నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రజాపాలన విజయోత్సవ సభలో పాల్గొని మాట్లాడుతున్న మాజీ మంత్రి వేణుగోపాల చారి

ఆర్థిక సహాయం చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్, అమీర్‌నగర్, కమ్మర్‌పల్లి గ్రామాల్లో పలువురు లబ్దిదారులకు రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కృషితో ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరు చేసిన ఆర్థిక సహాయం చెక్కులను ఆదివారం అందజేశారు. కమ్మర్‌పల్లి గ్రామానికి చెందిన 20మంది లబ్దిదారులకు రూ.3లక్షల 30వేల విలువైన ఆర్థికసాయం చెక్కులు మంజూరయ్యాయి. అమీర్‌నగర్‌లో ఆరుగురు లబ్ధిదారులకు గానూ రూ.లక్ష 55వేల విలువైన ఆర్థికసాయం చెక్కులు మంజూరయ్యాయి.

బషీరాబాద్ గ్రామంలో 9 మంది లబ్దిదారులకు రూ.2లక్షల 4వేల విలువైన ఆర్థిక సాయం చెక్కులు మంజూరయ్యాయి. ఆ చెక్కులను ఆయా గ్రామాల్లో స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులు లబ్దిదారుల ఇంటి వద్దకే వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆర్థిక సహాయం చెక్కుల మంజూరుకు కృషి చేసిన బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి లబ్దిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కమ్మర్‌పల్లిలో బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు కొంటే కంటి నరేందర్, మాజీ ఎంపిటిసి మైలారం సుధాకర్, బిఆర్ఎస్ మండల ఉపాధ్యక్షులు మల్యాల సుభాష్ గౌడ్, లోలపు సుమన్, బిఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు కొత్తపల్లి రఘు, బాల్కొండ సమన్వయ సమితి సభ్యుడు హమాద్ బాయ్, సొసైటీ డైరెక్టర్లు రేంజర్ల మహేందర్, మండల రైతు విభాగం అధ్యక్షుడు బద్దం రాజశేఖర్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సంత రాజేశ్వర్, మల్కాయ్ గంగారం, బషీరాబాద్‌లో బీఆర్ఎస్ గ్రామ శాఖ పార్టీ అధ్యక్షులు బైకని మహేష్, యూత్ అధ్యక్షులు బందెల రాజు, సీనియర్ నాయకులు తోట అప్పయ్య, నర్రా మోహన్, లక్ష్మి నర్సయ్య, నెల్ల రమేష్, శక్కారం శ్రీనివాస్, పెద్ది దేవన్న, అమీర్‌నగర్‌లో మలావత్ ప్రకాష్, పుప్పాల గంగాధర్, తోట ప్రసాద్, వర్దం రాజేందర్, క్యాతం రాజేందర్, గంగం గణేష్, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులను అందజేసిన నాయకులు

వ్యక్తి దారుణ హత్య

- జిల్లా కేంద్రంలోని మిర్చి కాంపౌండ్‌లో ఘటన

నవతెలంగాణ-కంఠేశ్వర్



మృతి చెందిన యూసుఫ్

నిజామాబాద్ నగరం లో ఓ వ్యక్తి దారుణ హత్య కు గురైన ఘటన ఒకటవ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలోని కర్బాలకు చెందిన యూసుఫ్ (45) అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. మృతుడు యూసుఫ్‌తో పాటు మరో ఇద్దరు ఓ ట్రాన్స్‌పోర్టు కార్యాలయం ఎదుట ఆదివారం రాత్రి పడుకున్నట్టు స్థానికులు, పోలీసులు తెలుపుతున్నారు. ఆ ముగ్గురిలో యూసుఫ్ దారుణ హత్యకు గురికాగా, మిగతా ఇద్దరు వ్యక్తులు ఉదయం నుంచి అక్కడ కనిపించలేదు. యూసుఫ్‌తో పాటు అక్కడ పడుకున్న ఇద్దరు వ్యక్తులే యూసుఫ్ గొంతుకోసి హత్య చేసారేమోనని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ట్రాన్స్‌పోర్టు యజమాని పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సంబంధిత వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి, ఎస్సై మొగులయ్య ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అక్కడున్న వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. యూసుఫ్‌తో పాటు నిద్రించిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుల సంఘాల అభివృద్ధికి నిర్విరామ కృషి

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ పొద్దుటూరి వినయ్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

కుల సంఘాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్విరామ కృషి చేస్తుందని నియోజకవర్గ ఇన్చార్జ్ పొద్దుటూరి వినయ్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని కొటార్మూర్ దేవాంగ సంఘం ఫండ్స్ మంజూరు చేయాలని సంఘ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవాంగ సంఘం అధ్యక్షులు గడ్డి ప్రకాష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అయ్యప్ప శ్రీనివాస్, 5, 6 వార్డుల కౌన్సిలర్లు చాలా ప్రసాద్, పొద్దుటూరి మురళీధర్‌రెడ్డి, ఎం.శేఖర్‌రెడ్డి, దేవాంగ సంఘం గ్రామ కమిటీ అధ్యక్షులు డిష్ గంగాధర్, రాజేశ్వర్, పసుపుల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి

సమస్యల సాధనలో స్టేట్ టీచర్స్ యూనియన్ ముందుంటుంది

- జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్

నవతెలంగాణ-కంఠేశ్వర్

సమస్యల సాధనలో ఎస్టియు ముందుంటుందని జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ అన్నారు. ఆదివారం 78వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం హైదరాబాద్‌లోని కాచిగూడలో ఉన్న ఎస్‌టియు భవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ.. సమస్యల సాధనలో ఎస్‌టియు ముందుంటుందని తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఏ సమస్య వచ్చినా ముందుండి సాధించడానికి కృషిచేస్తుందని అన్నారు. మనముందు ఇంకా అనేక సమస్యలైన పీఆర్సీని అమలు చేయించడం, సిపిఎస్ రద్దు చేయించడం, 317 జీవో బాధితులను స్వంత జిల్లాలకు పంపించడం, ఎస్ఎస్ఏ ఉద్యోగస్తులను రెగ్యులర్ చేయించడం, ఎయిడెడ్ ఉపాధ్యాయుల 37/2005 సమస్యను సాధించడం, డైట్, జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టులను ప్రమోషన్ ద్వారా భర్తీ చేసేవిధంగా కృషి చేయాలని రాష్ట్ర సంఘానికి వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంఘానికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు ధర్మేంధర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బెల్లాల్ శ్రీనివాస్, రాష్ట్ర కోకన్వీనర్ రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని కలిసిన యూత్ మండలాధ్యక్షులు

నవతెలంగాణ-నవీపేట్

బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన చిన్నదొడ్డి ప్రవీణ్ కుమార్ కాంగ్రెస్ మండల నాయకులతో మర్యాదపూర్వకంగా ఆదివారం కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించి మండలంలో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ జిల్లా వైస్ చైర్మన్ రామచందర్, నాయకులు బాబు, మహేందర్, విజయ్, పోతన్న తదితరులున్నారు.

ఇన్‌స్పైర్ రాష్ట్రస్థాయి ప్రదర్శనకు లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ ప్రాజెక్ట్



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల బృందం

నవతెలంగాణ-నవీపేట్

జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమంలో నవీపేట్‌కు చెందిన లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్ట్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ సస్టైనబుల్ ఫ్యూచర్ విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికైందని పాఠశాల కరస్పాండెంట్ హన్మాండ్లు తెలిపారు. ఇన్‌స్పైర్ మనక్ జిల్లా స్థాయిలో లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌కు చెందిన 4 ప్రాజెక్ట్‌లకు అవార్డులు రాగా శుక్ర, శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్.ఎఫ్.ఎస్. స్కూల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి ఇన్‌స్పైర్, రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన 2024లో లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థిని ఇందుప్రియ రూపొందించిన ప్రాజెక్టు రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైన విద్యార్థిని ఇందుప్రియ, గైడ్ టీచర్ శరత్‌ను నవీపేట్ మండల విద్యాధికారి అశోక్, పిఆర్టియు మండల జనరల్ సెక్రటరీ శివకుమార్, కరస్పాండెంట్ హన్మాండ్లు అభినందించారు.

గోవింద్‌పేట్‌లో ఆది మల్లన్న జాతర ఉత్సవాలు

నవతెలంగాణ-ఆర్మూర్



ఉత్సవాల్లో పాల్గొన్న పలువురు

మండలంలోని గోవింద్‌పేట్ గ్రామంలో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అగ్గి మల్లన్న జాతర ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మల్లన్న సిడి(రథం)ని బంతిపూలతో అలంకరించి గ్రామ పురవీధుల గుండా మల్లన్న ఆలయం వద్దకు ఊరేగింపుగా వెళ్ళారు. ఆలయం వద్ద భక్తులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రజలు మల్లన్న స్వామికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు, పసుపు బండారిని సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో అధిక సంఖ్యలో నడుచుకుంటూ వెళ్ళారు. ఈ కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, సొసైటీ చైర్మన్ బంటు మహిపాల్, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ



కర పత్రాలను అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని రెంజర్ల గ్రామంలో ఆదివారం ఉదయం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాపాలన విజయోత్సవాల కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా బూత్‌ల వారిగా పార్టీ కార్యకర్తలు ప్రతి ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కరపత్రాలను పంపిణీ చేశారు. బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడినా.. నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మగ్గిడి ముత్యం రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు గడ్డం చిన్నారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ భాషిత పాఠశాలకు కేంద్ర మంత్రి అకాడమిక్ ఎక్సలెన్స్ అవార్డు



అవార్డును అందుకుంటున్న కరస్పాండెంట్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని శ్రీ భాషిత పాఠశాలకు ఇటీవల హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీ భాషిత పాఠశాలకు బెస్ట్ అకాడమిక్ ఎక్సలెన్స్, కెరియర్ గైడెన్స్ ఎక్సెలెన్స్ ఇన్‌పేరెంట్ ఎంగేజ్మెంట్‌నకు అవార్డు అందజేశారు. ప్రతి ఏటా జరిగే ఈ అవార్డుల ప్రదానోత్సవంలో శ్రీ భాషితకు అవార్డు దక్కడం ఆనందంగా ఉందని శ్రీ భాషిత పాఠశాల కరస్పాండెంట్, చైర్మన్ పోలపల్లి సుందర్ ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి హాజరై ఆయన చేతుల మీదుగా కరస్పాండెంట్‌కు అవార్డు ప్రదానోత్సవం చేశారు. ఈ అవార్డు రావడం ఆనందంగా ఉందని దీనికి కృషి చేసిన, సహకరించిన పాఠశాల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులకు విద్యార్థుల తల్లిదండ్రులందరికీ ఈ అవార్డు అంకితం చేస్తున్నానని పాఠశాల కరస్పాండెంట్ తెలిపారు.

జీరో జిల్లెట్ ద్వారా అధిక లాభాలు



నవతెలంగాణ-సదాశివనగర్

మొక్కజొన్న జీరో జిల్లెట్ ద్వారా అధిక లాభాలు ఉంటాయని రైతులు తెలిపారు. పెట్టుబడి, శ్రమ తక్కువగా ఉండి ఆదాయం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. సాగు విధానంపై ఆదివరం నవతెలంగాణతో మాట్లాడారు. నీరు తక్కువగా ఉన్న రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని, విత్తనాలు ఆదా అవుతాయని పేర్కొన్నారు. రైతులకు దున్నడం ఖర్చులు తగ్గుతాయని సూచించారు. నీరు తక్కువగా ఉన్న రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని రైతులు తెలిపారు. ఈ పద్ధతి మండలంలోని యాచారం వజ్ర పల్లి తండా మూడేగాంధ ర్మారావు పేట్ తదితర గ్రామాల్లో ఈ పద్ధతి ద్వారా మొక్కజొన్న పంటను పండిస్తున్నట్టు వారు తెలిపారు.

అంజనాద్రి ఆలయ వార్షికోత్సవ సంబురాలు



నవతెలంగాణ-నిజాంసాగర్

మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో కొలువుదీరిన అంజనాద్రి ఆలయ ఏడవ వార్షికోత్సవ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు కిషోర్ కుమార్ మాట్లాడుతూ.. ప్రత్యేక పూజలు చేసినట్టు తెలిపారు. అనంతరం గ్రామంలోని ప్రజలంతా బోనాలు సమర్పించారని తెలిపారు. కార్యక్రమానికి జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు, మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే, ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ధపెదర్ రాజు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు కిషోర్ కుమార్ ప్రముఖులందరికీ అంజనాద్రి ఫోటో ఫ్రేమ్ నీ అందజేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం

- చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే తోట లక్ష్మికాంతారావు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్/మద్నూర్

పేదలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం నిలుస్తుందని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ఆడబిడ్డ పెళ్లిల కోసం ప్రభుత్వం కల్యాణ లక్ష్మి, షాదిముబారక్ పథకం ద్వారం ఒక లక్ష ఒకవంద పదహారు రూపాయలు ఇచ్చి అదుకుకుంటున్న ఘనత కాంగ్రెస్ పార్టీదని అన్నారు. అలాగే పలువురు పేదలు అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందడంతో వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని చెక్కులు అందించిన్నట్లు అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దశరథ్, గిద్ద వార్ అంజయ్య, పార్టీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి,శ్యామప్ప పటేల్, మల్లప్ప పటేల్, మొగుల గౌడ్, ఇస్మాయిల్,కల్లూరి పండరీ,హైమద్,తదితరులు పాల్గొన్నారు.



పెద్దకొడప్‌గల్: చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే



మద్నూర్: అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కొత్త అంబులెన్స్‌లను ప్రారంభించిన ఎమ్మెల్యే

మద్నూర్ : జుక్కల్ నియోజకవర్గానికి మంజూరైన మూడు 108 అంబులెన్స్‌లను మద్నూర్ మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఆదివారం ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రాష్ట్రంలో పూర్తిగా వెనుకబడిన జుక్కల్ నియోజకవర్గం ప్రజలకు అన్ని విధాలుగా వైద్య సౌకర్యాలు అందడానికి ప్రత్యేక కృషిలో భాగంగా నియోజకవర్గానికి 108 మూడు అంబులెన్స్‌లను మంజూరు చేయించినట్టు తెలిపారు. 108 ద్వారా అత్యవసర వైద్య చికిత్సల కోసం అంబులెన్స్ రావడం ఈ మండలానికి ఎంతో సౌకర్యంగా ఉంటుందని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేకు ఆస్పత్రి వైద్యులు వైద్య సిబ్బంది, 108 సిబ్బంది సన్మానించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

నవతెలంగాణ-భిక్కనూరు



నుజ్జు నుజ్జయిన కారులో మృతి చెందిన వ్యక్తి

మండలంలోని సిద్ధ రామేశ్వర నగర్ గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాదు నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న కారు ఆగి ఉన్న లారీని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి చనిపోగా మరొకరు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్తు ండగా మార్గమధ్యంలో చనిపోయారు. కారులో ఉన్న మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందిన వెంటనే ఘటన స్థలానికి ఎస్ఐ సాయికుమార్ చేరుకొని గాయాలు అయిన వారిని 108లో కామరెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కారులో ఇరుక్కుపోయి మృతి చెందిన వ్యక్తులను సిబ్బంది స్థానికుల సహాయంతో ఎస్ఐ బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రమైన తాడ్వాయిలో పోలీసులు వాహనాలను ఆదివారం తనిఖీ చేపట్టారు. హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు పలువురికి జరిమానా విధించారు. పెండింగ్ బకాయిలను చాలను ద్వారా చెల్లించాలని పలువురికి సూచించారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సూచించారు. కార్యక్రమంలో పోలీసులు, హెూంగార్డులు, ఉన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం

నవతెలంగాణ-తాడ్వాయి

కృష్ణజివాడి గ్రామ విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా శ్రీకాంత్ చారి, ఉపాధ్యక్షులుగా కమ్మరి స్వామి చారి, ప్రధాన కార్యదర్శిగా నాగభూషణం చారిని ఎన్నుకోగా శరత్ కుమార్ చారి లక్ష్మీ నరసింహ చారిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు. ఈ ఎన్నికలు ధర్మపురి నరసింహులు చారి ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న పలువురు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండల సమీపంలోని మత్తడి పోచమ్మ ఆలయ అభివృద్ధి పనులకు ఆదివారం ఆలయ కమిటీ కార్యవర్గ సభ్యులు టెంకాయ కొట్టి పనులు ప్రారంభించారు. గత రెండు నెలలుగా మత్తడి పోచమ్మ ఆలయ అభివృద్ధికి ఆలయ కమిటీ సభ్యులు విరాళాలు సేకరించడంలో నిమగ్నమయ్యారు. సేకరించినటువంటి విరాళాలతో ఆలయ పరిసర ప్రాంతాలు భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేయనున్నట్టు తెలిపారు. ఆలయం చుట్టూ ఎత్తు వంపులు లేకుండా చదును చేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం తాగునీటి సౌకర్యం విద్యుత్ సౌకర్యంతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించడానికి పనులు చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు పోతా గోని శంకర్ గౌడ్, అధ్యక్షులు దురిశెట్టి అశోక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు బుర్ర నారా గౌడ్, ఆలయ కమిటీ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్వప్నలోక్‌లో ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణంలోని దేవునిపల్లి స్వప్నలోక్ కాలనీలో శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద స్వప్నలోక్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ హెల్త్ చెకప్ క్యాంప్ లో షుగర్, బీపీ, రక్త పరీక్షలు, కళ్ళకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మెడిసిన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ పల్స హరీష్ గౌడ్, డాక్టర్ దివ్యభారతి, ఆప్తమాలజిస్ట్ లింబాద్రి, ల్యాబ్ టెక్నీషియన్ వినయ్‌లు, స్వప్నలోక్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కొడకల గోవర్ధన్, ఉపాధ్యక్షులు పసులాది రాజు, కార్యదర్శి మాలావత్ దశరథ్, కోశాధికారి వజీర్ మారుతి రావు, నీలం రమేష్, పడిగెల రాములు, రామ శంకర్, ప్రశాంత్, బండారి సంజీవరెడ్డి, కొవ్వూరి వెంకటేశ్వర శర్మ కాలనీవాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సోనియా గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించాలి

- డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాసరావు

నవతెలంగాణ-కామారెడ్డి

నేడే (9న) సోనియా గాంధీ జన్మదిన వేడుకలను జిల్లా మండల కేంద్రాలలో ఘనంగా నిర్వహించాలని కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల శ్రీనివాసరావు తెలిపారు. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాను సారం వేడుకలు నిర్వహించాలని సూచించారు. ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. తెలంగాణ రావడానికి ముఖ్య కారకురాలైన సోనియా గాంధీ.. తెలంగాణ ఇచ్చి తెలంగాణ తల్లిగా పేరు పొందారని, కావున నేటి సోమవారం ప్రతి జిల్లా మున్సిపల్ మండల గ్రామాలలో ఘనంగా నిర్వహించాలని తెలిపారు. తెలంగాణ బిల్లు ప్రక్రియ సైతం డిసెంబర్ 9న ప్రారంభించినట్టు గుర్తుచేశారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండలంలో అంచనూరు గ్రామంలో బీరప్ప ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన బీరప్ప విగ్రహ ప్రతిష్టాపన మహెూత్సవానికి కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో పలు పూజలు ఆదివారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం కుర్మ సంఘము సభ్యులు ఎమ్మెల్యే వెంకటరమణ రెడ్డి శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్, బీజేపీ మండల అధ్యక్షుడు మద్దూరు భూపాల్ రెడ్డి, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రవీందర్ రెడ్డి, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు అంజిరెడ్డి , మండల బీజేవైఎం మండల అధ్యక్షుడు కంది మనోజ్ కుమార్, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు శ్రీనాథ్ మండల బీజేవైఎం ప్రధాన కార్యదర్శి సచిన్ తదితరులు పాల్గొన్నారు బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

మచ్చర్ల గ్రామంలో చిట్టీ వ్యాపారి పరార్

నవతెలంగాణ-ఆలూర్(ఆర్మూర్)

ఆలూర్ మండలంలోని మచ్చర్ల గ్రామానికి చెందిన ఒక చిట్టి వ్యాపారి గత 15 రోజులుగా కనపడకుండా పోవడంతో చిట్టి సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయం ఆదివారం వెలుగులోకి రాగా తీవ్ర చర్చనీయం అయింది. సదరు వ్యాపారి గ్రామంలోని బంధువులు, పరిచయస్తులు, మిత్రుల ద్వారా చిట్టీలు వేయించాడు. కాగా సభ్యులకు చిట్టి డబ్బులు చెల్లించక పోగా గ్రామం నుండి కనబడకుండా పోవడం చర్చనీయాంశంగా మారింది. వ్యాపారాల్లో దివాలా తీయడం, ఐపి పెట్టడం పరిపాటిగా మారింది. కొందరు నిజంగా వ్యాపారాల్లో నష్టపోయి చేసిన అప్పులను తీర్చలేక కోర్టును ఆశ్రయిస్తుండగా, మరికొందరు అప్పులు తీర్చే స్తోమత ఉన్నా డబ్బుల ఎగవేతకు ఐపీలు పెడుతున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

పెన్షనర్స్ డే ను విజయవంతం చేయండి

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న రామ్మోహన్‌రావు

డిసెంబర్ 17 జాతీయ పెన్షన్స్ డే సందర్భంగా నిజామాబాద్ లోని న్యూ అంబేద్కర్ భవన్ లో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెన్షనర్స్ డే ని నిర్వహిస్తు న్నట్లు జిల్లా అధ్యక్షులు కే రామ్మోహన్రావు తెలిపారు. ఆదివారం మల్లు స్వరాజ్యం ట్రస్ట్ భవన్ నందు జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడు తూ..పెన్షనర్స్ డే సందర్భంగా రెండు రోజులపాటు ఆటల పోటీలను రిటైర్డ్ ఉద్యోగులకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పెన్షన్ అనేది ప్రాథమిక హక్కుగా గుర్తించిన దినంగా డిసెంబర్ 17న దేశవ్యాప్తంగా పండుగలా జరుపుకుంటున్నట్లు ఆయన తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల మూలంగా పెన్షన్ అనేది ప్రమాదంలో పడిందని దానిని కాపాడుకోవడం కోసం పునరా అంకితం అవటం కోసం ఈ కార్యక్ర మాన్ని నిజామాబాదులో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు రిటైర్డ్ ఉద్యోగులందరూ డిసెంబర్ 17 న్యూ అంబేద్కర్ భవన్ కు ఉదయం 10:30 గంటలకు హాజరు కావాల్సిందిగా, సభను విజయవంతం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బోధన్ ఎమ్మెల్యే పి సుదర్శన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అడిషనల్ కలెక్టర్ ఎస్ కిరణ్ కుమార్, జాతీయ రాష్ట్ర పెన్షనర్స్ యూనియన్ నాయకులు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు.

అనారోగ్యంతో సీనియర్ జర్నలిస్ట్ మృతి



దయానంద్ (ఫైల్)

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్టు ఆర్మిశెట్టి శెట్టి దయానంద్ (69) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో గత కొంతకాలంగా చికిత్స పొందుతున్న ఆయన.. పరిస్థితి విషమించి మృతిచెందారు. సీనియర్ జర్నలిస్టు మృతిపట్ల పలువురు సంతాపం ప్రకటించారు. తోటి జర్నలిస్టులు ఆయన స్వగృహానికి వచ్చి సంతాపం వ్యక్తం చేశారు. కామారెడ్డి సీనియర్ న్యాయవాది జేఏసీ కన్వీనర్ జగన్నాథం కు దయానంద్ చిన్ననాటి మిత్రుడు, అతని మిత్రులు, పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కైలాస్ శ్రీనివాసరావు, మాజీ లైబ్రరీ చైర్మన్ పున్న రాజేశ్వరరావు, తెలంగాణ జేఏసీ కన్వీనర్, అడ్వకేట్ జగన్నాథం, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు పండ్ల రాజు , సి డి సి మాజీ చైర్మన్ అశోక్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ బట్టు పోచయ్య, పాత్రికేయులు, ప్రముఖులు నివాళులర్పించి, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

బాధిత కుటుంబాలకు బీమా చెక్కులు అందజేత

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని ఆయా గ్రామాలలో ఆదివారం ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పలు కుటుంబాలను పరామర్శించారు. మండలంలోని పోల్కంపేట్ గ్రామానికి చెందిన బాధిత కుటుంబాలను పరామర్శించి.. వారికి బిఆర్ఎస్ పార్టీలో క్రియ శీల సభ్యత్వం ఉండడంతో రెండు లక్షల బీమా చెక్కును వారి కుటుంబానికి అందజేశారు. పర్మళ్లలో పార్టీ కార్యకర్త గంట సంతోష్ మృతి చెందగా.. ఆ కుటుంబాన్ని పరామర్శించి బీమా చెక్కును మృతుని తండ్రి రత్నయ్యకు అందజేశారు. ఆయన వెంట కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్, రాజశేఖర్ రెడ్డి, మాజీ ఎంపీపీ ముదాం సాయిలు, శ్రీకాంత్, నరసింహులు, రూప్ సింగ్, కామిని శ్రీనివాస్, పర్వయ్య కోడ బోయిన శ్రీను, గన్ను నాయక్, రవీందర్, పీర్ సింగ్, వివేకానంద తదితరులు ఉన్నారు.

బీఎస్ఎన్ఎల్ సేవలకు అంతరాయం

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలో శనివారం నుంచి బిఎస్ఎన్ఎల సేవలకు అంతరాయం ఏర్పడడంతో బిఎస్ఎన్ఎల్ ఫోన్లు మూగబోయాయి. శనివారం మధ్యాహ్నం నుంచి ఆదివారం మధ్యాహ్న వరకు బిఎస్ఎన్ఎల్ సేవలు పనిచేయకపోవడంతో వినియోగదరులు తీవ్ర ఇబ్బందులు గురయ్యారు. వందలాది మంది బిఎస్ఎన్ఎల్ సేవలు ఉపయోగించుకుంటున్నప్పటికిని సిగ్నల్‌లో అంతరాయం ఏర్పడగా వాటిని సరి చేయడంలో బిఎస్ఎన్ఎల్ అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా బిఎస్ఎన్ఎల్ ఉన్నత అధికారులు సకాలంలో స్పందించి మెరుగైన సేవలందించాలని పలువురు కోరుతున్నారు.

మానవత్వం చాటుకున్న మున్సిపల్ చైర్పర్సన్

నవతెలంగాణ-కామారెడ్డి



ఆస్పత్రిలో సిబ్బందితో మాట్లాడుతున్న ఇందుప్రియ

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తికి ఆస్పత్రికి తరలించి, వైద్య సేవలు అందే విధంగా చర్యలు తీసుకొని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందు ప్రియ తన ఔదర్యాన్ని చాటారు. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం కామారెడ్డి మండలం ఉగ్రవాయి గ్రామ శివారులోని భవానిపేట్ స్టేజి వద్ద ఉగ్రవాయ గ్రామానికి చెందిన లింగం అనే వ్యక్తిని, గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అతను రోడ్డు పక్కన పడి ఉండడం చూసి అటువైపు వెళుతున్న చైర్ పర్సన్ తన కారు ఆపి, అంబులెన్స్ కి సమాచారం వచ్చి దగ్గరుండి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించి, అనంతరం ఆస్పత్రికి వెళ్లి డాక్టర్లతో మాట్లాడారు.

ఆలయ అభివృద్ధికి విరాళాల సేకరణ

నవతెలంగాణ-లింగంపేట్

మండల సమీపంలోని మత్తడి పోచమ్మ ఆలయ అభివృద్ధికి ఆలయ కమిటీ సభ్యులు విరాళాలు ఆదివారం సేకరించారు. ఆదిపరాశక్తి మత్తడి పోచమ్మ ఆలయ అభివృద్ధి కోసం నూతనంగా 18 కుల సంఘాల సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ ఆదేశానుసారం ఆలయ అభివృద్ధికి అందరి సహకారం అవసరమైన ఉద్దేశంతో విరాళాలు సేకరిస్తున్నారు. వ్యాపారులు ప్రముఖులు అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధికి విరాళాలు అందిస్తున్నారు. ఆదివారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్ర నారా గౌడ్ రూ.51 వేలు విరాళం అందించారు. కటిక గోపి రూ.22 వేలు, అంకం బాలరాజు రూ.11 వేలు విరాళం అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు పోతా గోని శంకర్ గౌడ్. ఆలయ కమిటీ అధ్యక్షులు దురిశెట్టి అశోక్, ఆలయ కమిటీ కార్యవర్గ సభ్యులు కమ్మరి వెంకటేశం, మారుతి, మురళి, శివయ్య, ప్రసాద్‌గౌడ్, కౌడ రవి, సంజీవులు లక్ష్మణరావు, శ్రీనివాస్ రాజు, నరేష్, తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి సీనియర్ కబడ్డీకి పేట్‌సంగం క్రీడాకారిణి



కబడ్డీ క్రీడాకారులు

నవతెలంగాణ-గాంధారి

రాష్ట్ర స్థాయి సీనియర్ కబడ్డి పోటీలకూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెట్ సంగం విద్యార్థిని నేనవత్ సుచరిత ఎంపిక అయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుమారా స్వామి తెలిపారు. ఈ నెల 5న కామారెడ్డి జిల్లా కేంద్రంలోని లయోలా పాఠశాలలో జరిగిన ఎంపిక పోటీల్లో అద్భుత క్రీడా ప్రదర్శన చేయడంతో ఆమెను నిర్వాహకులు ఎంపిక చేసి నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మణ్ రాథోడ్ తెలిపారు. ఇదే నెల 8 నుండి 10 వరకు హైదరబాద్ లో జరుగుతున్న రాష్ట్ర స్థాయి పోటీలకు కామారెడ్డి జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సుచరిత ఎంపికలో పట్ల గ్రామస్తులు ఉపాధ్యాయులు అభినందించారు.

డయాబెటిస్ క్యాంపు

నవతెలంగాణ-సదాశివనగర్

సదాశివనగర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం డయాబెటిస్ క్యాంప్ నిర్వహించారు. 46 మందికి పరీక్షలు నిర్వహించినట్టు నిర్వహకులు తెలిపారు. కార్యక్రమంలో లైన్స్ క్లబ్ సదాశివ నగర్ అధ్యక్షులు కొప్పుల నర్సారెడ్డి సెక్రటరీ వి కమలాకర్ రావు, ట్రెజరర్ వి శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ సిహెచ్ రాములు, నారాయణ, డైరెక్టర్స్ జి శ్రీనివాస్, లడ్డు, వి రాజేందర్, ఎస్ రాంరెడ్డి, జే గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండలలాధ్యక్షుడికి పరామర్శ



కాంగ్రెస్ అధ్యక్షుడిని పరామర్శిస్తున్న ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి

నవతెంగాణ-రామారెడ్డి

మండల కాంగ్రెస్ అధ్యక్షులు గొల్లపల్లి లక్ష్మాగౌడ్ అనారోగ్యం బారిన పడ్డాడని తెలుసుకొని జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గే రెడ్డి మహేందర్రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఆరోగ్య భద్రత ముఖ్యమని, చికిత్సతో పాటు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు రగొత్తంరెడ్డి, రేకుల సత్యం, తదితరులు పాల్గొన్నారు.

పడగల్ గ్రామంలో బోనాల సంబరాలు

నవతెలంగాణ-ఆర్మూర్(వేల్పూర్)

మండలంలోని పడగల్ గ్రామ శివారులో గల ఆదివారం నిర్వహించిన ఆది మల్లన్న జాతరలో స్కౌట్స్ అండ్ గైడ్ పదవ తరగతి విద్యార్థులు జాతరలో సెక్యూరిటీ నిర్వహించారు. బోనాలు డప్పు వాయిద్యాలతో భాజాభజంత్రీలతో గ్రామస్తులు ఆలయం వరకు బోనాలు తీసుకొచ్చి బోనాలు సమర్పించారు. అనంతరం ఐదుచుట్లు రథోత్సవం నిర్వహించారు. జాతరలో నైవేద్యాలు సమర్పించారు. జాతర సందర్భంగా విన్యాసాలు అందరినీ అలరించాయి. జాతర ఉత్సవాలు గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వేల్పూర్ పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.



బోనాల ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్తులు

నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని పద్మశాలి సంఘంలో శ్రీ మార్కండేయ ఆలయ అభివృద్ధి ఆధ్వర్యంలో సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షులుగా బుస శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఒమాజీ కిషన్, కార్యదర్శి కట్కం రవీందర్, కోశాధికారి తౌట్ కోటేష్, సలహాదారులు పర్పెల్లి నర్సయ్య, తాటికొండ నరేందర్, బొట్ల సంతోష్, చెలిమెల రమేష్ ఎన్నికయ్యారు. సమావేశం పంథా మెతరులు మామిడాల నవీన్, గుండు నాగరాజు, మేసరి నవీన్, అందె వెంకటగిరి సమక్షంలో ఎన్నుకున్నారు.



ఎన్నికైన నూతన కమిటీ

చలో అసెంబ్లీని విజయవంతం చేయండి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

విద్యారంగ సమస్యల పరిష్కారానికై పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఈనెల 10న జరగబోయే చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.నరేందర్, డాక్టర్ కర్క గణేష్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కోటగల్లిలో ఎన్.ఆర్.భవన్ (నీలం రామచంద్రయ్య భవన్)లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రిని కేటాయించాలని, రాష్ట్ర బడ్జెట్లో విద్యా రంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌లతో ఈనెల 10న చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలను విద్యార్థుల ఆత్మహత్యలను నివారించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్, ఫీజ్ రియింబర్స్‌మెంట్, మెస్, కాస్మోటిక్ చార్జీల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పీ.జీ, డిగ్రీ సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులరైజ్ చేయాలని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో అసంపూర్ణ భవన నిర్మాణాలు, గురుకుల సంక్షేమ వసతి గృహాలకు సొంత భవన నిర్మాణాలు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తున్న కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని నూతన జేఎన్టీయూ సబ్ క్యాంపస్‌లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విద్యార్థులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎల్.అనిల్ కుమార్, జిల్లా నాయకులు మహిపాల్, నసీర్, రేహాన్ తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లి మండల కేంద్రానికి కొత్తగా 108 అంబులెన్స్



నవతెలంగాణ-ధర్పల్లి

మండల కేంద్రానికి శనివారం నూతనంగా 108 అంబులెన్స్ మంజూరై నట్టు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుశాంత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ సర్వీసు కావాలంటే సిరికొండ, ఇందల్వాయి లేదా డిచ్‌పల్లి నుంచి అంబులెన్స్ మనకు అందుబాటులో ఉండేదని, కానీ ఇప్పటి నుంచి ధర్పల్లి మండల కేంద్రంలో నూతనంగా 108 అంబులెన్స్ అందుబాటులో ఉంటుందని వివరించారు. తద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ధర్పల్లి మండల ప్రజలు అంబులెన్స్ వచ్చిన సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు.

కొడిచర్లలో పిరమిడ్ ధ్యాన మందిరం ప్రారంభం



మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-మెండోరా

మెండోరా మండలంలోని కోడిచర్ల గ్రామంలో ధ్యాన దంపతులు పడిగెల రాజవ్వ లింగారెడ్డి నూతనంగా నిర్మించిన శ్రీ రాజరాజేశ్వర పిరమిడ్ ధ్యాన మందిరాన్ని శ్రీశ్రీశ్రీ పిట్ల కృష్ణ మహారాజ్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మూగజీవాల సంరక్షణ కోసం అహింసాయుత మహాకరుణ శాఖాహార ర్యాలీని గ్రామంలో ప్రధాన వీధుల గుండా నిర్వహించారు. అనంతరం పిట్ల కృష్ణ మహారాజు మాట్లాడుతూ.. తల్లిదండ్రులను, గురువులను పూజించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ధ్యానం చేసి జ్ఞానం పొందాలని, ధ్యానం ద్వారానే ప్రజలందరూ జీవితంలో సంతోషంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో పీఎస్ఎస్ఎం నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ సాయి కృష్ణారెడ్డి, పిరమిడ్ నిర్మాణ కర్తలు పరిగెల రాజవ్వ లింగారెడ్డి, పిఎస్ఎస్ఎమ్ బాధ్యులు బొడ్డు దయానంద్, సుఖాల లక్ష్మణ్, మామిడి లక్ష్మారెడ్డి, ప్రేమ్‌కుమార్, అమరవాజీ శ్రీనివాస్, మల్లారం సాయినాథ్, పిరమిడ్ మాస్టర్లు నాగంపేట్ శ్రీనివాస్, బోదేపల్లి రాజు, డికొండ శ్రీనివాస్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

క్యాటరింగ్ వర్కర్ల కష్టాలెన్నో..

- ఫంక్షన్‌లలో అందరి సంతోషమే వీరికి ముఖ్యం
- పంచభక్ష పరమాన్నాలున్నా చివరికి మిగిలితేనే వారికి భోజనం
- చాలీచాలనీ కూలీతో రాత్రంతా విధులలోనే
- క్యాటరింగ్ వర్కర్లుగా హాస్టల్ విద్యార్థులు



ఫైల్

నవతెలంగాణ-బోధన్

శుభ కార్యాలలో బంధు,మిత్రులకు రకరకాల ఆహార పదార్థాలు వడ్డించి అతిథుల ఆనందానికి కారకులవుతారు క్యాటరింగ్ కార్మికులు. విందు భోజనంలో పంచభక్ష పరమాన్నం ఉన్నా.. కడుపునిండా తినలేని పరిస్థితి క్యాటరింగ్ కార్మికులది. చాలీచాలని కూలీ డబ్బులతో రాత్రి, పగలు క్యాటరింగ్ వర్కర్లుగా పనిచేస్తూ కుటుంబానికి ఆసరగా ఉంటున్న ఈ క్యాటరింగ్ వర్కర్ల దీనస్థితిని ఏ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

నేటి ఆధునిక కాలంలో శుభకార్యాలు చేసేవారు ఖర్చులకు వెనుకాడకుండా అంగరంగ వైభవంగా చేస్తున్నారు. దానికి తోడు ఎన్నో రకాల ఆహార పదార్థాలు వడ్డిస్తూ బంధు, మిత్రులను ఆకట్టుకుంటున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. శుభకార్యాలలో పెళ్లింటి వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారి కష్టాన్ని ధారబోస్తున్నారు క్యాటరింగ్ వర్కర్లు. అందరూ సంతోషంగా గడిపినా వీరిని మాత్రం పట్టించుకోరు.

కుటుంబ పోషణ కోసం క్యాటరింగ్ వర్కర్లుగా..

చాలామంది నిరుపేద కుటుంబాలకు చెందిన యువతులనే కొంతమంది వ్యక్తులు క్యాటరింగ్ వర్కర్లుగా ఎంచుకుంటున్నారు. వర్కర్లకు ఒకేరంగు దుస్తులు ఇచ్చి డ్రెస్‌కోడ్ ఉండేలా చూస్తారు. ఎందుకంటే శుభకార్యాలలో వచ్చిన వారిని ఆకట్టుకోవాలనే తపనతో వీరిని తీసుకెళుంటారు. క్యాటరింగ్ పనిలో చేరేముందు క్యాటరింగ్ నిర్వాహకుల నిబంధనలు పాటించాల్సిందే. డ్యూటీలో చేరగానే అందంగా ముస్తాబై అతిథులకు కావలసిన ఏర్పాట్లు చేయాలి. తాగునీరు, భోజనాలు అందించాలి. ఎదురు తిరిగి మాట్లాడితే మరోసారి పనిలో తీసుకోమని నిర్వాహకులు బెదిరిస్తారని సమాచారం. దాంతో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా భరించి పనిచేస్తారు. ఇంత చేసినా.. వారికి ఇచ్చేది కేవలం రూ.200ల కూలి మాత్రమే. దగ్గర ప్రాంతంలో అయినా దూరం ప్రాంతంలో అయినా వారికి అదే కూలి. క్యాటరింగ్ ఏజెన్సీ నిర్వాహకులు పెళ్లింటి వారి వద్ద ఒక వర్కర్ పేరుతో రూ.500 వసూలు చేస్తున్నా.. వర్కర్లకు మాత్రం రూ.200 మాత్రమే ఇస్తారని సమాచారం. కొన్నిసార్లు రూ.100 అందజేసినా కిమ్మనకుండా తీసుకోవాల్సిందేనని తెలిసింది. శుభకార్యం రాత్రి అయినా, పగలైనా మొత్తం ముగిసే వరకూ ఉండాల్సిందే. చివరికి మిగిలిన భోజనం మాత్రమే పెడతారని పలువురు వర్కర్లు వారి ఆవేదన వ్యక్తం చేశారు. కూలి పెంచాలని అడిగితే ఈసడించుకుంటారని పలువురు వర్కర్లు తెలిపారు. అలాగే హాస్టల్‌లో ఉండి చదువుకునే విద్యార్థులను సైతం కొంతమంది క్యాటరింగ్ వర్కర్లుగా తీసుకెళ్తున్నారు. దాంతో విద్యార్థులు చదువుపై దృష్టి సారించకుండా కూలీలుగా మారుతున్నాయి. మైనర్లను, విద్యార్థులను క్యాటరింగ్ వర్కర్లుగా తీసుకువెళ్లే వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

సంచార జాతులకు రాజకీయాల్లో అవకాశం కల్పించాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సంచార జాతులకు రాజకీయాల్లో అవకాశం కల్పించాలని తెలంగాణ రాష్ట్ర సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్ తిపిరిశెట్టి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగజోగి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులుగా ద్యారంగుల నగేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మీడియా తిపిరిశెట్టి శ్రీనివాస్, సింగజోగి శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో సంచార జాతులకు రాజకీయ అవకాశం లేకుండా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచార జాతి కులాలు బిసిల్లో 52, ఎస్సీల్లో 10, ఎస్టీల్లో 4 కులాలున్నాయని తెలిపారు. ఇవి జనాభా ప్రకారం బిసిల్లో 12శాతం, ఎస్సీల్లో 20 ఎస్టీల్లో 10శాతం ఉన్నారని తెలిపారు. అయినా వీరిని పట్టించుకున్న నాథుడే లేడని వివరించారు. ఈ జాతి ప్రజలను పైన తెలిపిన సామాజిక వర్గాల్లో ప్రత్యేక గ్రూప్ చేసి ప్రత్యేక రిజర్వేషన్స్ కల్పించి అన్ని రంగాల్లో వేర్వేరుగా 10శాతం రిజర్వేషన్స్ ఇవ్వాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 6 ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీగా ఉన్న సందర్భంగా సంచార జాతి బిడ్డలకు ప్రత్యేకంగా ఒక సీటు కేటాయించి గెలుపు కోసం అధికార పార్టీ కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భీమ్‌రాజు, మందుల, వేముల రఘు, కుంచెపు ఆనంద్, రాజ్‌కుమార్, రమేష్, గంగాధర్, దండ్ల గంగారం, బత్తుల నాగేష్, తిమ్మయ్య, గంగారాం, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పలువురు

ఎన్‌సిఎస్‌ఎఫ్ సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీని తెరిపించాలి

- బెల్లం కేంద్రంగా మార్చాలి
- చెరుకు ఉత్పత్తిదారుల సంఘం కన్వీనర్ ఆకుల పాపయ్య

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఎన్‌సిఎస్‌ఎఫ్ సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీని తెరిపించాలని, అలాగే బెల్లం కేంద్రంగా మార్చాలని చెరుకు ఉత్పత్తిదారుల సంఘం కన్వీనర్ ఆకుల పాపయ్య డిమాండ్ చేశారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీని తెరిపిస్తామని ప్రభుత్వం తెలిపిందని, దానిని తాము స్వాగతిస్తున్నామని వివరించారు. అదేవిధంగా ఇప్పటికే ఫ్యాక్టరీ తెరిపిస్తామని ప్రభుత్వం చెప్పిన మాట మేరకు ఏడాది గడుస్తున్నా ఇంకా కాలయాపన చేస్తుందని, ప్రభుత్వం వెంటనే ఎన్‌సీఎస్‌ఎఫ్ ఫ్యాక్టరీని తెరిపించి, దానిని బెల్లం కేంద్రంగా మార్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు టి.కృష్ణగౌడ్, సాయిలు, ఆకుల రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చెరుకు ఉత్పత్తిదారుల సంఘం కన్వీనర్ ఆకుల పాపయ్య

13న మహా పడిపూజ మహోత్సవం

నవతెలంగాణ-ముప్కాల్

వెంచిర్యాల అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 13న శనివారం అయ్యప్ప స్వామి మహా పడిపూజ మహోత్సవాన్ని శ్రీ బంగారు వెంకటేశ్వర ఆలయంలో చేపట్టనున్నట్లు గురుస్వామి నడ్కుడ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చాముండేశ్వరి గురుదత్తా పీఠం వ్యవస్థాపకులు శ్రీ రామ శరన్ శర్మ గురూజీ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంచిర్యాల గ్రామ సేవా సమితి సభ్యులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని ధర్మారం (బి)లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2006-2007 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరూ వివిధ రంగాల్లో ఉద్యోగం, వ్యాపారంలో స్థిరపడిన విషయాలు ఒకరికొకరు పంచుకున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో కుటుంబ సభ్యులు, పూర్వ అధ్యాపకులతో జరుపుకున్నారు. గత కొన్ని రోజులుగా కొందరు విద్యార్థులు కలిసి అందరినీ ఒకే చోటికి రప్పించడం జీవితంలో మంచి అనుభూతి, ఆనందం కలిగిందని వారు వివరించారు. అధ్యాపకులకు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఉపాధ్యాయ అధ్యాపక సమస్యల కోసం నిరంతర పోరాటం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ ప్రెస్ క్లబ్లో టిఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఉమ్మడి కరీంనగర్ అదిలాబాద్ మెదక్ నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి పోకల నాగయ్య విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలుస్తున్నానని ఉపాధ్యాయ అధ్యాపక సమస్యలపై గత 18 సంవత్సరాల నుండి నిరంతరం పోరాటం చేస్తున్నామని ఉపాధ్యాయులు అధ్యాపకులు అందరి మద్దతుతోటే బరిలో నిలుస్తున్నానని తప్పకుండా అందరూ ఆదరించి మీ అమూల్యమైన ఓటును వేయగలరని వేడుకుంటున్నాను, ఈ కార్యక్రమంలో టి పి టి ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆవుల రాజేష్ యాదవ్, టిఎల్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ రాజు టిఎల్ఎఫ్ నిజామాబాద్ పట్టణ అధ్యక్షులు గజానంద్, టిఎల్ఎఫ్ జిల్లా నాయకులు నవీన్, శ్రీకాంత్, మురళి, విజయ్ , శ్రీకాంత్ పాల్గొన్నారు.

బైకు దొంగతనాలకు పాల్పడిన యువకుడి అరెస్ట్

నవతెలంగాణ-కంఠేశ్వర్

జల్సాలకు అలవాటుపడి నిజామాబాద్‌లో బైక్‌లు దొంగతనం చేస్తున్న పాత నేరస్తుడిని అరెస్టు చేసినట్లు ఒకటవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రఘుపతి ఆదివారం తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. నవీపేట్ మండలం బినోల గ్రామానికి చెందిన ఎరుకల ప్రశాంత్ (28) అనే యువకుడిని పట్టుకొని పోలీసులు విచారించారు. విచారణలో భాగంగా ప్రశాంత్ నేరం ఒప్పుకొని తాను దొంగిలించిన వాహనాలను పోలీసులకు చూపించారు. నేరస్తుడితోపాటు మూడు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరు పరిచారు. నేరస్తుడిని రిమాండ్‌కు తరలించనున్నారు. నేరస్తుడిని పట్టుకోవడానికి వాహనాలను సీజ్ చేయడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఏఎస్ఐ షకీల్, పోలీస్ కానిస్టేబుల్ గంగారం, రవిని పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వ గురుకులాల పరిస్థితి అధోగతి

- బీఆర్‌ఎస్వీ విభాగం గురుకుల బాట సందర్శన కమిటీ జిల్లా ఇన్చార్జ్ సాయి తేజ

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సర కాలంలో ప్రభుత్వ గురుకులాల పరిస్థితి అధోగతి పాలైందని బీఆర్‌ఎస్వీ విభాగం గురుకుల బాట సందర్శన కమిటీ జిల్లా ఇన్చార్జ్ సాయి తేజ అన్నారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థ ప్రక్షాళన కోసం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఇకపై బిఆర్ఎస్వీ ఆధ్వర్యంలో విద్యా వ్యవస్థ ప్రక్షాళనకై ప్రత్యక్ష కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు బీఆర్‌ఎస్వీ విభాగం గురుకుల బాట సందర్శన కమిటీ జిల్లా ఇన్చార్జ్ సాయి తేజ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తమ పార్టీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన గురుకుల బాట సందర్శన కమిటీ బృందం ప్రతి గురుకుల ప్రభుత్వ హాస్టల్లో పరిస్థితిని సమీక్షించనున్నామని తెలిపారు. విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను ఫోటోలు తీసి తమ పార్టీ అధిష్టానం దృష్టికి తమ కమిటీ తీసుకెళ్తుందని పేర్కొన్నారు. దాని ద్వారా పార్టీ నిర్ణయం ఉంటుందన్నారు. గత సంవత్సర కాలంగా విద్యార్థి విభాగాన్ని, విద్యావ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడంలో పూర్తిగా విఫలం చెందిందని ఆయన అన్నారు. ఉడికీ ఉడకని బియ్యం, పురుగులతో కూడిన పప్పు నీళ్లతో విద్యార్థులకు ప్రభుత్వ హాస్టల్లో భోజనాలు పెడుతున్నారని, ఇది చాలా దుర్మార్గమైన చర్య అని, తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. తమ పార్టీ హయాంలో గురుకలాలను ప్రవేట్ విద్యా సంస్థలకు ధీటుగా నాణ్యమైన చదువుతోపాటు పౌష్టికాహారం అందించామని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ చైర్మన్ దాదన్నగారి విట్టల్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్వీ విభాగం గురుకుల బాట సందర్శన కమిటీ జిల్లా ఇన్చార్జ్ సాయి తేజ

మాదిగ జేపీసీ నిజామాబాద్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

మాదిగ జేపీసీ నిజామాబాద్ జిల్లా నూతన కమిటీని నగరంలోని ఆదివారం ఎన్నుకున్నారు. ఆర్అండ్‌బీ అతిథి గృహంలో జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. మాదిగ జేపీసీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు బరికుంట శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యంలో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు.

ఈ సందర్భంగా మాదిగ జేపీసీ జిల్లా అధ్యక్షులుగా బరికుంట శ్రీనివాస్‌ను, మాదిగ జేపీసీ జిల్లా ఇన్చార్జిగా మోతే భూమన్న, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉంగరాల రాజేశ్వర్, మాదిగ జేపీసీ జిల్లా అధికార ప్రతినిధిగా మల్లాని శివ, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బోయిని జోసఫ్, జిల్లా ఉపాధ్యక్షులుగా దేవయ్య, ప్రకాష్, కార్యవర్గ సభ్యులుగా విట్టల నరేష్, కందుల రాములు, తైదా పోశెట్టి, సగ్గుపట్ల చిరంజీవి, తెడ్డు రాజేష్, సంఘం ప్రభాకర్‌ను ఎన్నుకున్నారు. మాదిగ జేపీసీ నిజామాబాద్ జిల్లా మహిళా విభాగం కన్వీనర్ గాబాయికాడీ లతను ఎన్నుకున్నారు.

ప్రారంభానికి నోచుకోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం



ప్రారంభానికి నోచుకోని ఆరోగ్య కేంద్ర భవనం

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని రూ.కోటి 52 లక్షల వ్యయంతో నిర్మాణం పూర్తి చేసినప్పటికీ ఇంతవరకూ భవనాన్ని ప్రారంభించలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలోనున్న ఆరోగ్య కేంద్రం శిథిలావస్థకు చేరుకోవడమే కాకుండా ఔషధాలను భద్రపరిచే గదిపై పెచ్చులూడి పడుతుండడంతో వైద్య సిబ్బంది భయంభయంగా ఆ గదిలోకి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటీవల జిల్లా వైద్య అధికారులు సందర్శించిన సమయంలో వైద్య సిబ్బంది వారి దృష్టికి తీసుకువచ్చారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకొని నిర్మాణం పూర్తయిన ఆరోగ్య కేంద్రం భవనాన్ని ప్రారంభించడానికి సహకరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
సోమవారం | డిసెంబర్ 09, 2024 | www.navatelangana.com

గుండెపోటుతో స్కావెంజర్ మృతి



నవతెలంగాణ-రెంజల్

మండలంలోని దూపల్లి ప్రాథమిక పాఠశాలలో స్కావెంజర్‌గా పని చేస్తున్న లచ్చింగారి సాయిలు (50) గుండెపోటుతో మృతిచెందారని గ్రామస్తులు పేర్కొన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ పాఠశాలలో ఆయన స్కావెంజర్‌గా సేవలను అందిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమ్మ ఆదర్శ పాఠశాలల నుంచి వీరికి ప్రత్యేక నిధులను కేటాయించారు. ఒకటి నుంచి 30 మంది పిల్లలు ఉన్న పాఠశాలలలో రూ.3000, 30 నుంచి ఆపైనున్న విద్యార్థుల సంఖ్యను బట్టి వీరి జీతం పెరుగుతూ ఉంటుంది. అయితే సాయిలు మృతితో ప్రస్తుతం వారి కుటుంబం రోడ్డున పడిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులున్నారు. ప్రభుత్వం కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

16న ఎల్లన్న స్మారక సభ జయప్రదం చేయండి

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని గడుకోల్ గ్రామంలో ఈ నెల 16న ఉదయం 11 గంటలకు ఎల్లన్న స్మారక సభను నిర్వహిస్తున్నట్టు న్యూడెమోక్రసీ సబ్ కార్యదర్శి బాలయ్య, ఏఐకేఎంఎస్ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి మార్క్స్ తెలిపారు. ఆదివారం మండలంలోని రేకులపల్లిలో అయన సమావేశం నిర్వహించారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. పేదింటిలో పుట్టిన ఎల్లన్న శ్రమజీవుల రాజ్యం కోసం రైతు కూలీ సంఘం నాయకుడిగా అనేక పోరాటాలకు నాయకత్వం వహించారని తెలిపారు. 77 ఏళ్ల స్వాతంత్ర్య భారతంలో పాలకులు మారినా.. ప్రజల బతుకులు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రైతు వ్యతిరేక 3 నల్లచట్టాలు, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కార్డులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పోడు భూములకు పట్టాలను ఇవ్వాలని, రుణమాఫీ మిగిలిన వారందరికీ యుద్ధ ప్రాతిపదికను జమచేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు గంగాధర్, లక్ష్మణ్, దాసు, భూమయ్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

అంతా అవినీతిమయం

లంచావతారులపై ఉక్కుపాదం మోపుతున్న ఏసీబీ

- అయినా మారని కొందరు అధికారుల తీరు
- నేడు అంతర్జాతీయ అవినీతి నిర్మూలన దినోత్సవం

సమాజం అవినీతి మయమవుతుంది. లంచం ఇస్తే గానీ పనులు జరగడం లేదు. ఇటు ప్రభుత్వ శాఖలు, అటు ప్రైవేటు రంగంలోనూ అవినీతిపరుల చేతులు తడపనిదే పనులు ముందుకు సాగడం లేదు. ఇక రాజకీయాల్లోనైతే అవినీతి విచ్చలవిడిగా విలయతాండవం చేస్తుంది. ప్రభుత్వ శాఖల్లో అవినీతిపరులు రెచ్చిపోతున్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ సేవలు అందించాల్సిన క్రమంలో బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్నామన్న విషయాన్ని మరిచి ప్రవర్తిస్తున్నారు. లంచగొండితనం, అవినీతి, విధుల పట్ల నిర్లక్ష్యం మచ్చ తెస్తున్నవి. నేడు అంతర్జాతీయ అవినీతి నిర్మూలన దినోత్సవం సందర్భంగా నవతెలంగాణ ప్రత్యేక కథనం.



నవతెలంగాణ-ఆర్మూర్

పింఛన్లు మొదలుకొని టెండర్లు, అవినీతి అధికారుల చేతులు తడిపితే కానీ ఫైలు ముందుకు కదలని పరిస్థితి. ముఖ్యంగా రెవెన్యూ, పంచాయతీరాజ్, నీటిపారుదల, రవాణా, పోలీస్, విద్య, వైద్య, ఆరోగ్య, విద్యుత్, ట్రెజరీ లాంటి శాఖల్లో అవినీతి పెచ్చరిల్లుతుంది. తోటి ఉద్యోగుల పదోన్నతుల విషయంలోనూ చేతివాటం చూపుతున్నారు. పనికి ఒక రేటు, ఫైలుకు ఒక రేటు పెట్టుకుంటూ లంచాలకు పాల్పడుతున్నారు. అవినీతి నిరోధక శాఖ ఆధ్వర్యంలో నిరంతరం దాడులు కొనసాగుతున్నా ఎలాంటి మార్పు రావడం లేదు. అవినీతి నిరోధక శాఖ అధికారులు వరుస దాడులు చేస్తున్నప్పటికీ వారిలో మార్పు రావడం లేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో కొందరు అధికారులు లంచవతారం ఎత్తి అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారు. అవినీతి అధికారులు ఏసీబీ అధికారులకు చిక్కి సస్పెన్షన్‌కు గురవుతున్నా వారిలో ఎలాంటి మార్పు రావడం లేదు. అవినీతి అధికారులతో పలు ప్రభుత్వ శాఖల పరువు మంటగలుస్తోంది.

కొన్ని సంవత్సరాల నుంచి నమోదైన కేసులు..

అవినీతి నిరోధక శాఖ అధికారులు 2015 సంవత్సరంలో మొత్తం 15 కేసులు నమోదు చేసి అవినీతిపరులను జైలుకు పంపారు. 2017 సంవత్సరం ఆర్మూర్ సబ్ రిజిస్టర్ కార్యాలయంపై అప్పటి ఏసీబీ డీఎస్పి నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. 2018 జనవరిలో ఆర్మూర్ ఆర్డీవోగా పనిచేసిన బాలే శ్రీనివాస్ వాటర్ ప్లాంట్ యజమాని నుంచి డబ్బులు డిమాండ్ చేస్తూ ఎసిబి అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఇదే సంవత్సరం బాల్కొండ పంచాయతీ కార్యదర్శి ఏసీబీకి చిక్కారు. 2019 మార్చి 27న బోధన్ మున్సిపాలిటీలో అపాయింట్మెంట్ కోసం రూ.30,000 డిమాండ్ చేసిన సానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఏసీబీకి పట్టుబడ్డారు. జూన్ 13న కామారెడ్డి జిల్లా పెద్దకొడప్‌గల్ మండలం బేగంపూర్ వీఆర్ఏ శంకర్ వ్యవసాయ భూమి పట్టా కోసం 8,000 లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. ఇదే నెలలో 19న జిల్లా కేంద్రానికి చెందిన ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ గూపన్‌పల్లికి చెందిన వ్యక్తి కల్లు అమ్మకానికి సంబంధించి కేసు నమోదు కాకుండా ఉండేందుకు డబ్బులు డిమాండ్ చేస్తూ పట్టుబడ్డారు. 2020లో కామారెడ్డి పట్టణ సిఐ, బాన్సువాడ రూరల్ సిఐ, బోధన్ రూరల్ సిఐ ఎసిబి వలలో పడ్డారు. ఈ ముగ్గురు అధికారులది ఒకే బ్యాచ్ కావడం గమనార్హం. 2022 సంవత్సరం పెర్కిట్ ఐసిడిఎస్ కార్యాలయ ఇంచార్జ్ పిడి, సిడిపిఓ డాటా ఎంట్రీ ఆపరేటర్‌ను ఎసిబి అధికారులు పట్టుకున్నారు. గత సంవత్సరం జూన్ నెలలో తెలంగాణ యూనివర్సిటీ వీసి రవీందర్ రూ.50,000 లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. పదవ నెలలో జిల్లా కేంద్రం దక్షిణ మండల కార్యాలయ ఆర్ఐ రాజు, ప్రైవేటు వ్యక్తి మంత్రి హరీష్ కుమార్‌తో కలిసి భూమి విషయంలో 8,000 లంచం తీసుకుంటుండగా ఏసీబీ డిఎస్పిగా పనిచేసిన ఆనంద్ కుమార్ పట్టుకున్నారు. ఇదే నెల జిల్లా కేంద్రంలోని కోనేటి విజయ్ కుమార్ తన కారును జిల్లా కలెక్టరేట్‌ని సమాచార శాఖ కార్యాలయంలో నెలకు రూ.33 వేల అద్దెకు ఇవ్వడం జరిగింది. మూడు నెలల నుండి అద్దె మంజూరుకు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ వేణి ప్రసన్న విజయ్ కుమార్ నుండి 9,000 లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. నవంబర్ నెల 8వ తేదీ బాన్సువాడ ఇంచార్జ్ సబ్ రిజిస్టర్ సతీష్ 9,000 లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు.

ఈ సంవత్సరం ఇలా..

జక్రాన్‌పల్లి మండలంలోని తొర్లికొండ పంచాయతీ కార్యదర్శిణి, మార్చ్ నెలలో కమ్మర్‌పల్లి ఎంపీడీవో కార్యాలయ అధికారులు ఏసీబీకి చిక్కారు. తోటి ఉద్యోగి వద్ద లంచం డిమాండ్ చేసిన సీనియర్ అసిస్టెంట్ హరిబాబు, బదిలీపై భిక్కనూర్‌కు వెళ్లిన ఎంపీడీవో సంతోష్‌రెడ్డిని ఏసీబీ డిఎస్పి శేఖర్ గౌడ్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మే నెలలో సాలూర చెక్‌పోస్ట్ వద్ద 13,519 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆగస్టు 9వ తేదీ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్పొరేషన్ ఇంచార్జ్ రెవెన్యూ ఆఫీసర్ దాసరి నరేందర్ ఆరు కోట్లకు పైగా నగదుతో పట్టుబడడం జిల్లా కేంద్రంలో తీవ్ర సంచలనం రేపింది. 1996లో మున్సిపల్‌లో బిల్ కలెక్టర్‌గా చేరి ఎన్నో ఏళ్లుగా కదలకుండా, అవినీతిలో ఆనకొండగా ముద్రపడి ఏసీబీకి చిక్కారు. ఈయనను నాంపల్లి కోర్టులో హాజరు పరచగా కోర్టు 14 రోజుల పాటు రిమాండ్ విధించి చంచల్ గూడా జైలుకు తరలించారు. సెప్టెంబర్ నెలలో నందిపేట్ పంచాయతీ సెక్రెటరీ నవీన్ కుమార్ ఇంటి పర్మిషన్ కోసం 8,000 లంచం తీసుకుంటూ పట్టుబ డ్డారు. గత నవంబర్ నెలలో స్టేషన్ బెయిల్ కోసం ఒక రైతు వద్ద 20,000 లంచం డిమాండ్ చేస్తూ వర్ని ఎస్సై కృష్ణ కుమార్, లింగంపేట్ ఎస్సై అరుణ్ కుమార్‌లు వారం రోజుల వ్యవధిలోనే ఏసీబీ వలకు చిక్కారు. కామారెడ్డి జిల్లాలోని నాగిరెడ్డిపేట్ తహసీల్దారుగా పనిచేసిన లక్ష్మణ్ అవినీతి అక్రమాలకు పాల్పడడంతో కలెక్టర్ సస్పెన్షన్ చేశారు.



జిల్లా కేంద్రంలోని ఏసీబీ కార్యాలయం

తీరు మారాలి..

లంచం తీసుకున్న కేసులో అధికారులకు జైలు శిక్షలు, జరిమానాలు కోర్టు విధించడంతో సమాజంలో ఇబ్బందికర పరిస్థితులుండడంతో పాటు లంచగొండిగా ముద్ర పడుతుంది. ఇదే సమయంలో వృత్తి జీవితంపై ప్రభావం చూపుతుంది. ఆర్థిక ఇబ్బందులు ఏర్పడే అవకాశాలు ఎక్కువ. ఈ నేపథ్యంలో ప్రతి ఉద్యోగి లంచానికి దూరంగా ఉండి పని చేయాల్సిన అవసరం ఉంది. వృత్తి ధర్మాన్ని నిక్కచ్చిగా నిర్వహించి నిజాయితీతో కూడిన సేవలు అందిస్తే మంచి గుర్తింపు లభిస్తుంది.

లంచం తెచ్చిన విషాదం...

రూ.25,000 లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన నిజామాబాద్ మున్సిపల్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు జనవరి 21, 2017 సంవత్సరంలో ఐదంతస్తుల భవనం నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. కాగా ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది.

పైసలు ఇస్తేనే పని.. ఏసీబీ నజర్..

ఒకవైపు ఏసీబీ అధికారులు దాడులు చేస్తున్నా అధికారులు అవినీతిని మాత్రం వదలడం లేదు. చేతులు తడిపితేనే పనులు చేస్తున్నారని ఆరోపణలున్నాయి. పౌరసరఫరా శాఖలో ప్రతిదానికి ఒక రేటు నిర్ణయించి కేటా యింపులు చేస్తారని ప్రచారం ఉంది. ఇటీవల ఈ శాఖకు చెందిన ఇద్దరు అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. అయితే డబ్బులు ఇవ్వని వారిని అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారు. దీంతో పనుల కోసం వచ్చిన వారు ఎంతో కొంత ముట్ట చెబుతున్నారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్న అధికారులపై ఏసీబీ దృష్టి సారించింది. సదరు ఉద్యోగి కుటుంబ సభ్యుల నుంచి ఆదాయ వివరాలను తెలుసుకొని తర్వాత ఉద్యోగికి వచ్చిన నెలసరి వేతనం వివరాలను పక్కాగా పరిశీలించిన తర్వాత అధికారులపై చర్యలు తీసుకుంటారు. ఉమ్మడి జిల్లాలోని పలు శాఖలలో అవినీతి ఆరోపణలు తరచూ వినిపిస్తున్నాయి. ఆదాయానికి మించి ఆస్తులున్న అధికారుల వివరాలు ఏసీబీ సేకరిస్తున్నట్లు సమాచారం.

ప్రజలు సహకరించాలి

ప్రభుత్వ శాఖల్లో అవినీతిని రూపుమాపేందుకే అవినీతి నిరోధక శాఖ పనిచేస్తుంది. అధికారులు ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే ప్రజలు నిర్భయంగా ఫిర్యాదు చేయాలి. ప్రతి ఉద్యోగి తాను ప్రజలకు సేవ చేస్తున్నాననే భావంతోనే పనిచేయాలి. లంచాల కోసం డిమాండ్ చేస్తే టోల్ ఫ్రీ నంబర్ 1064, ఏసీబీ డి.ఎస్.పి 9154388950, ఇన్‌స్పెక్టర్లు 9154388951, 9154388953, 9154388923 నెంబర్లకు ఫోన్ చేయవచ్చు.

– శేఖర్‌గౌడ్, ఏసీబీ డిఎస్పి, నిజామాబాద్

కొత్త 108 అంబులెన్స్ సేవలు ప్రారంభం


అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 108 వాహనాన్ని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు పుప్పాల శంకర్, షాహిద్ హుస్సేన్, అగ్రి మార్కెట్ కమిటీ చైర్మన్ గైక్వాడ్ హన్మంతు, కోటగిరి సహకార సంఘం అధ్యక్షులు సిద్దు, మాజీ ఎంపిపి గంధపు పవన్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు, గ్రామపంచాయతీ సిబ్బంది, ప్రజలు, పాల్గొన్నారు.

సిద్ధార్థ మోడల్ స్కూల్‌కు ది బెస్ట్ స్కూల్ అవార్డు



అవార్డు అందుకుంటున్న కరస్పాండెంట్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని కలిగోట్ గ్రామంలో గల సిద్ధార్థ మోడల్ స్కూల్‌కు ది బెస్ట్ స్కూల్ అవార్డు వచ్చినట్టు పాఠశాల కరస్పాండెంట్ గంగారెడ్డి ఆదివారం తెలిపారు. హైదరాబాద్ పట్టణంలోని జూబ్లీహిల్స్‌లో ఈటి టెక్ ఆధ్వర్యంలో ది బెస్ట్ స్కూల్ ప్రోగ్రాంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. నేటి గ్లోబల్ ప్రపంచానికి అవసరమైన విద్యను విద్యార్థులకు అందిస్తూ భారతీయ విద్యా విధానాన్ని ఖండంతరాలకు వ్యాపింపజేసి విదేశీ విద్యార్థులు ఇండియాకు వచ్చి చదువుకునేలా మన విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలని తెలిపారు. అవార్డు అందుకున్న యజమాన్యాన్ని అభినందించారు. అవార్డును సిద్ధార్థ పాఠశాల కరస్పాండెంట్ గంగారెడ్డి అందుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ గంగారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థిలో ప్రేరణ కలిగిస్తూ సృజనాత్మకంగా విద్యను అందిస్తున్నందుకు గ్రామీణ ప్రాంతమైన తమ స్కూల్‌కు ది బెస్ట్ స్కూల్ అవార్డు ఎంపిక చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మంత్రితో పాటు ట్రస్మ, ఇటీ టెక్, ఈడి ఎక్స్ ప్రతినిధులు, వివిధ పాఠశాల యజమాన్యాలు పాల్గొన్నారు.

ప్రైవేటు ఉపాధ్యాయ, అధ్యాపక సమస్యలపై నిరంతర పోరాటం

- పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి పోకల నాగయ్య

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రైవేట్ ఉపాధ్యాయ అధ్యాపక సమస్యల కోసం నిరంతరం పాటుపడతానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోకల నాగయ్య తెలిపారు. ఆదివారం నిజామాబాద్ ప్రెస్‌క్లబ్‌లో టిఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి పోకల నాగయ్య విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలుస్తున్నానని, ఉపాధ్యాయ అధ్యాపక సమస్యలపై గత 18 సంవత్సరాల నుంచి నిరంతరం పోరాటం చేస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులు అధ్యాపకుల అందరి మద్దతుతోనే బరిలో నిలుస్తున్నానని తప్పకుండా అందరూ ఆదరించి మీ అమూల్యమైన ఓటును వేయాలని కోరారు. కార్యక్రమంలో టిపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆవుల రాజేష్ యాదవ్, టిఎల్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ రాజు, టిఎల్ఎఫ్ నిజామాబాద్ పట్టణ అధ్యక్షులు గజానంద్, టిఎల్ఎఫ్ జిల్లా నాయకులు నవీన్, శ్రీకాంత్, మురళి, విజయ్, శ్రీకాంత్, పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న బోనాల పండుగ


బోనాల ఊరేగింపులో పాల్గొన్న యాదవ మహిళలు, యువతులు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండల కేంద్రంలోని యాదవ సంఘాల ఆధ్వర్యంలో మల్లన్న బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు దాదాపు రెండు కిలోమీటర్ల దూరం నెత్తిన బోనాలతో, కాలినడకన వెళ్ళి ఆలయంలో బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా యాదవ సంఘ పెద్దలు మాట్లాడుతూ.. సోమవారం అన్నదానం, జాతర, మంగళవారం తెల్లవారుజామున అగ్నిగుండాలు దున్నడం, నాగవెల్లి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం

నవతెలంగాణ-మోపాల్


వేలాడుతున్న వైర్లను చూపుతున్న రైతు

మండల కేంద్రంలోని తనకుర్తి గ్రామ సమీపాన పంట పొలాల దగ్గర విద్యుత్ వైర్లు వేలాడుతున్నాయి. అయినప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. చేతికందే విధంగా వైర్లు కిందకు వేలాడు తున్నాయని రైతులు అంటు న్నారు. అనుకోని ఘటన ఏదైనా జరిగితే బాధ్యులు ఎవరని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ వైర్లను సరిచేయాలని రైతులు కోరుతున్నారు.

బిజెపి కార్యవర్గ సభ్యుడి రాజీనామా

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

బిజెపి పార్టీ కార్యవర్గ సభ్యుడు చౌహన్ మోహన్ నాయక్ బీజేపీ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు. మండలంలోని నల్లగుట్ట తండా మాజీ సర్పంచ్ చౌహన్ మోహన్ నాయక్ ప్రస్తుతం జిల్లా బిజెపి పార్టీ కార్యవర్గ సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఆయన ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా బిజెపి పార్టీ కార్యవర్గ సభ్యుడిగా బిజెపి పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు తెలియజేశారు. తన వ్యక్తిగత కారణాలవల్ల బిజెపి పార్టీకి రాజీనామా చేసి తన జాతి కొరకు పోరాటం చేస్తానని తెలిపారు.

10న చలో హైదరాబాద్



మాట్లాడుతున్న నూర్జహాన్..


సమావేశానికి హాజరైన ఆశావర్కర్లు

- జయప్రదం చేద్దాం
- సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ పిలుపు

నవతెలంగాణ-కంఠేశ్వర్

కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన హామీమేరకు ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18000 అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆశా వర్కర్ల విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూర్జహాన్ మాట్లాడుతూ.. గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న లెప్రసీ, పల్స్‌పోలియో, టీబి, కంటి వెలుగు డబ్బులు వెంటనే చెల్లించాలన్నారు. పారితోషికం పేరుతో ఆశాలను వెట్టిచాకిరికి గురిచేస్తున్నారని తెలిపారు. ఆశాలకు కనీస వేతనం పెరుగుతున్నా ధరలకు అనుగుణంగా రూ.18వేలు వెంటనే అమలు చేయాలని, పిఎఫ్, ఈఎస్ఐ వంటి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని అధికారుల వేధింపులను ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుకన్య, రేణుక, బాలమణి, రమ, సంగీత, రేవతి, సాహెరా, రాధా, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత దారుణ హత్య

నవతెలంగాణ-బాల్కొండ

బాల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని వన్నెల్ (బి) గ్రామంలో మహిళ దారుణ హత్యకు గురైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా బిలోలి తాలూకా, బెల్కొని గ్రామానికి చెందిన జంగ శివకల (33) తన భర్త రాజు గంగారాంతో కలిసి బతుకుదెరువు కోసం వన్నెల్ (బి) గ్రామానికి వలస వచ్చి ఓ రైతు వద్ద పనిచేస్తున్నారు. రైతు వద్ద పనిచేస్తున్న దంపతులు శనివారం రాత్రి ఎప్పటి లాగే నిద్రపోయారు. ఆదివారం ఉదయం జంగం శివకల (33) రక్తం మడుగులో విగత జీవిగా పడి ఉంది. స్థానికులు




గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఇదిలా ఉండగా.. భర్త రాజు కనిపించకుండా పోవడంతో శివకల హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. శివకలను భర్త రాజునే హత్య



చేశాడని కుటుంబీకులు అనుమానిస్తున్నారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఘటనా స్థలాన్ని ఆర్మూర్ ఏసిపి వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్ఐ బి.నరేష్, క్లూస్ టీంతో కలిసి పరిశీలించారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

రబీ సీజన్ ప్రారంభం


వరినాట్లు వేస్తున్న కూలీలు



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లా వ్యాప్తంగా పలు మండలంలోని రబీ సీజన్ ప్రారంభమైంది. అందులో భాగంగానే వ్యవసాయ పంట మడుల్లో నీటిని నింపి, ట్రాక్టర్‌లో దుక్కి, దమ్ము పనులు చేపడుతున్నారు. నాట్లు సైతం వేస్తున్నారు.


ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న దృశ్యం